https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే చాటింపు

సారథ్యంలో

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 44 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ శనివారం,నవంబర్,14, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-



నిమ్స్ పేషెంట్లకు టిమ్స్‌లో సర్జరీలు

మంత్రి రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, నవంబర్13: పంజాగుట్ట నిమ్స్‌లో వెయిటింగ్ పేషెంట్లకు సనత్‌నగర్‌టిమ్స్‌లో సర్జరీలు నిర్వహించాలని అధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ రెండు ఆసుపత్రుల సమన్వయంతో సర్జరీల వెయిటింగ్‌కు చెక్ పెట్టాలని వారికి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో నిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. నిమ్స్‌లో పెరుగుతున్న పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలి పారు. ఆపరేషన్ థియేటర్ల కొరతతో సర్జరీల కోసం పేషెంట్లు నిరీక్షిస్తున్నట్లు సమాచారం అందిందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. సర్జరీల కోసం టిమ్స్‌లో అందు బాటులో ఉన్న అత్యాధునిక ఆపరేషన్ థియేట ర్లను వినియోగించాలని అధికారులకు స్పష్టం చేశారు. అందుకోసం వెంటనే టిమ్స్‌ను సందర్శిం చాలని నిమ్స్‌లోని వివిధ విభాగాల అధిపతులు (హెచ్‌వోడీ లు)కు సూచించారు.



నాతో చర్చకు వస్తే ప్రధాని పదవిలో మోదీ కొనసాగలేరు..



రాహుల్ గాంధీ సవాల్..

న్యూఢిల్లీ,నవంబర్,13 :ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి బహిరంగ చర్చకు సవాల్ విసిరారు. తనతో ముఖాముఖి చర్చకు వస్తే మోదీ ప్రధానమంత్రి పదవిలో కొనసా గలేరని వ్యాఖ్యానించారు. తాజాగా భారత్ జోడో ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేసిన వీడియో సందేశంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మోదీ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా రాహుల్ ఈ సవాల్ విసిరినట్లు తెలుస్తోంది. దీంతో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. తమ ఇద్దరి మధ్య నేరుగా చర్చ జరిగితే ప్రధానమంత్రి పదవిలో మోదీ కొనసాగలేరని హామీ ఇస్తానన్నారు. విదేశీ శక్తుల సహకారంతోనే మోదీ ప్రధానమంత్రి అయ్యారని, ఇప్పటికీ ఆ పదవిలో కొనసాగుతున్నా రని రాహుల్ గతంలో వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ శక్తుల ప్రభావం ఉందని, విదేశీ సోషల్ మీడియా హ్యాండిల్స్ కూడా మోదీకి మద్దతుగా పనిచేస్తున్నాయని ఆరోపించారు ఈ అంశాలపై ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు రావచ్చని సవాల్ విసిరారు. చర్చకు వేదికను, మధ్యవర్తిని మోదీనే నిర్ణయించుకోవచ్చని కూడా సూచించారు.

రాహుల్ ఆలోచనలను విదేశీయులు హ్యాక్ చేశారు..

ఫోన్ ను హ్యాక్ చేయాల్సిన అవసరం మాకేంటి?: బిజేపీ



న్యూఢిల్లీ,నవంబర్,13 :తన ఫోన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్యాప్ చేయిస్తున్నారంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలను పూర్తిగా నిరాధారమైనవిగా కొట్టిపారేసిన బీజేపీ నాయకులు, ఆ ఆరోపణలకు గల ఆధారాలు ఏమిటని నిలదీశారు. ప్రధానితో చర్చ జరగాలంటూనే, మరోవైపు ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం రాహుల్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ప్రధాని మోదీతో జరగాల్సిన చర్చకు సంబంధించి ఏయే అంశాలపై మాట్లాడాలనే దానిపై ఇన్‌స్టాగ్రామ్‌లో రాహుల్ గాంధీ నెటిజన్ల నుంచి సూచనలు కోరారు. ఈ క్రమంలో ఓ యూజర్ అడిగిన ప్రశ్నకు రాహుల్ బదులిస్తూ.. ప్రధాని మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారితీశాయి. రాహుల్ వ్యాఖ్యలపై కేంద్ర సహాయ మంత్రి బీఎల్ వర్మ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ గతంలో చేసిన ఆరోప ణలకైనా, ఇప్పుడు చేస్తున్న వాటికైనా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. “సభ నడుస్తున్నప్పుడు కాంగ్రెస్ నేతలు చర్చల నుంచి పారిపోతారు. వారికిసభలోచర్చించే ధైర్యం లేదు. వారుచెప్పేదానికి, చేసేదానికి చాలా తేడా ఉంటుంది. ఆధారాలు లేకుండా ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం మానుకోవాలి. దేశ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు, సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతారు” అని వర్మ హెచ్చరించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్.పి. సింగ్ మాట్లాడుతూ, కేవలం వార్తల్లో నిలవడానికే రాహుల్‌గాంధీ ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేస్తు న్నారని విమర్శించారు. “రాహుల్ ప్రతిరోజూ ఒక కొత్త అబద్ధాన్ని తెరపైకి తెస్తున్నారు. ఆయన ఫోన్ నిజంగానే ట్యాప్ అవుతుంటే, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన ఫోన్‌ను విచారణ నిమిత్తం అప్పగించాలి.

TELANGANA RISING
CURE - PURE - RARE



కలిసి ఎదుగుదాం

INVEST TELANGANA
GLOBAL SUMMIT
2026
7 | 8 | 9 డిసెంబర్ 2026
భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్



ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం...

జారీ చేసిన వారు: సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి:కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 13(డీకే చాటింపు): రైతులు,భూయజమానుల ప్రయోజనార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన భూము ల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. జక్రాన్పల్లి మండలం మాదాపూర్, మెండోరా మండలం వెల్గటూర్ లో కొనసాగు తున్నభూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శ కాలను పక్కాగా పాటిస్తూ, నిబంధన లకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధి కారులకు సూచించా రు. రైతులు, పట్టాదార్ల కు ఇబ్బందులు కలుగ కుండా చూడాలన్నారు. ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వే ను నిర్వహిస్తూ, వేగ వంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.సర్వే సంద ర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే, తమ దృష్టికి తేవాలన్నారు. రీ సర్వే వేగవంతానికి అదనం గా అవసరమైన రోవర్ యంత్రాలను సమకూ రుస్తామని అన్నారు. రీ సర్వే ప్రక్రియ నిర్వహణలో అలస త్వానికి తావిస్తే ఎంత మాత్రం ఉపేక్షించబోమ ని, నిర్లక్ష్యంగా వ్యవహ రించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటా మని కలెక్టర్ స్పష్టం చేశారు.సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి,వారి



సమక్షం లో సర్వే నిర్వహించా లని కలెక్టర్ ఆదేశించా రు. భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవా లన్నారు. గ్రామ హద్దు, ప్రభుత్వ భూమి, పట్టా భూములకు సంబంధించిన పూర్తి వివరాలు రీసర్వే ఆధారంగా పక్కాగా నమోదు చేయాలన్నారు. సర్వే అనంతరం గ్రామ సభలు నిర్వహిస్తూ, ఎవరికైనా అభ్యంత రాలు ఉంటే వారి నుండి దరఖాస్తులు స్వీకరించి వేగంగా పరిష్కరించాలన్నారు. రీసర్వే విషయంలో రైతులకు, భూ యజ మానులకు ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేయా లని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవె న్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి 51,000 విరాళం అందించి దాతృత్వాన్ని చాటుకున్న చిలుక మధుర ఉపేందర్ రెడ్డి

మహేశ్వరం, నవంబర్ 13 (డీకే చాటింపు) మహేశ్వరం నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్ డివిజన్ పరిధిలోని, ఎన్టీఆర్ నగర్ ఫేజ్ -3 లో నూతనంగా నిర్మించనున్న కోదండ రామాలయ దేవాలయ నిర్మాణానికిబి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుర ఉపేందర్ రెడ్డి రూ. 51,000 (అక్షరాలా యాభై ఒక్క వేల రూపాయలు) విరాళంగా అందజేసిబి తన ఉదార స్వభావాన్ని, దైవభక్తిని, సేవా గుణాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ విజ్ఞప్తికి స్పందించి ఆలయ నిర్మాణానికి పెద్ద మొత్తంలో విరాళం అందించిన చిలుక మధుర ఉపేందర్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే బిఆలయ నిర్మాణానికి చేయూతనివ్వడం అంటే ఆధ్యాత్మికతకు, సమాజ ఐక్యతకు బాటలు వేయడం. దైవకార్యంలో భాగస్వామి కావడమే నిజమైన సేవకు నిదర్శనమన్నారు. వారు చూపిన దాతృత్వం అభినందనీయమని, శ్రీ సీతారామచంద్ర స్వామిబి మరియు శ్రీ ఆంజనేయ స్వామిబి వారి ఆశీస్సులతో ఆయన భవిష్యత్తులో మరిన్ని



సేవా కార్యక్రమాలు చేపట్టి, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లినానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, కానుగడ్డ శ్రీకాంత్, దర్గా శివ యాదవ్, భాస్కర్ యాదవ్, కొత్త రవి, సూర్య, వినోద్, శంకర్, రవి, కౌసల్య, పార్వతీ, భయమ్మ, కవిత పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

448 రోజులుగా నిరంతర అన్నదానం



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 13 (డీకే చాటింపు):నగరంలోని ఆర్మూర్ రోడ్డు ప్రధాన రహదారి లోనీ భాగ్యలక్ష్మి ఫిల్లింగ్ స్టేషన్ యజమాని నుంకోజు శ్రీరాములు అన్నదాన కార్యక్రమం నిరంతరంగా కొనసాగి స్తున్నారు.ఈ మహ త్కార్య కార్యక్రమం 2025 సంవత్సరంలో స్వాతంత్ర దినోత్సవం రోజు 2025 లో ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమం నిరంతరంగా కొనసాగు తుందని,పేద, బలహీన వర్గాలు,ఆటో కార్మికు లతో నిత్యం శ్రమించే వారు ఇక్కడ తమ ఆకలి బాధను తీర్చు కుంటున్నారు.శ్రీ రాములు, భాగ్యలక్ష్మి దంపతులు నిర్వహి స్తున్న మంచి కార్యక్ర మాన్ని చూస్తున్న పలువురు అభినంది స్తున్నారు. అన్నదాత శ్రీ రాములు తల్లి తండ్రులు ఈశ్వరమ్మ, వెంకన్న ధన్యులని ఆకలి తీర్చుకుంటున్న వందలాది మంది సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత
అటవీ సంపదను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు.

ములుగు జిల్లా,డీకే చాటింపు(13 నవంబర్): అడవులను సంరక్షించడం ద్వారానే పర్యావరణ సమతుల్యతను కాపాడగలమని ములుగు జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు.అటవీ సంపదను రక్షించేందుకు సంబంధిత శాఖలన్నీ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అటవీ పరిరక్షణ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పోలతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడవులు వాతావరణ మార్పులను తగ్గించడంతో పాటు జీవవైవిధ్యం, జల వనరులను సంరక్షించడంలో, భూమి కోతను నివారించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు.అటవీ భూముల ఆక్రమణ, అక్రమంగా చెట్ల నరికివేత, కలప అక్రమ రవాణాపై రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖలు సంయుక్త చర్యలు తీసుకోవాలని, అటవీ పరిసర గ్రామాల్లో అటవీ చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, నిబంధనల ప్రకారం ఉల్లంఘనదారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.వన్యప్రాణులు, వాటి ఆవాసాలను రక్షించడానికి నిరంతర నిఘా ఉంచాలని, అటవీ అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కూడా ఆయన కోరారు.జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా మాట్లాడుతూ జిల్లా భౌగోళిక విస్తీర్ణంలో 72% కంటే ఎక్కువగా అడవుల విస్తీర్ణం ఉందని తెలిపారు.వన్యప్రాణుల వేట, ఉచ్చులు, కలప,ఇసుక అక్రమ రవాణాపై మరింత కఠిన నిఘా ఉంచాలని,అటవీ అగ్నిప్రమాదాలను నివారించడానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజన సంఘాల హక్కులను గౌరవిస్తూనే, గుత్తికోయ ఆవాసాల చుట్టూ కొత్తగా పోడు వ్యవసాయం జరగకుండా నిరోధించాలని, ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పోలీసులతో కలిసి సంయుక్త గస్తీ నిర్వహించాలని అధికారులను కోరారు.జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ అటవీ సంరక్షణకు పూర్తి సహకారం అందించాలని పోలీసు అధికారులందరికీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మెరుగైన సమన్వయం కోసం సున్నితమైన అంశాలను ముందుగానే సంబంధిత పోలీసు అధికారి దృష్టికి తీసుకురావాలని, సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడానికి సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్,అటవీ,రెవెన్యూ శాఖలు క్రమం తప్పకుండా సంయుక్త అవగాహన సమావేశాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్,పోలీసు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి
కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సీ.ఎస్ సంజయ్ జాజు

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 13 డీకే చాటింపు): రాబోయే రబీ 2026-27 సీజన్‌లో నీటిలభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొం దించాలని, రైతులను వరికి బదులుగా ప్రత్యా మ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. కూరగాయలు వంటి ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశించారు.శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యా చరణ ప్రణాళిక, విద్యా శాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, వీబీజీరాంజీ పనుల పురోగతిపై నిర్వహించి న వీడియో కాన్ఫరెన్స్ లో సీఎస్ పలు అంశా లను సమీక్షించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ మాట్లాడుతూ, రబీ 2026-27 సీజన్‌లో ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేనందున వరి సాగు ను నివారించాలని అన్నారు. పంటల వైవిధ్యీకరణ, పంటల ఉత్పాదకత పెంపు, రైతు రిజిస్ట్రీ నమోదు, కస్టమ్ హైరింగ్ కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తి స్థాయిలో వినియోగిం చు కోవాలని, ప్రత్యా మ్నాయ పంటల సాగు తో కలిగే ప్రయోజనా లు, ప్రభుత్వం అందిస్తు న్న ప్రోత్సాహకాలు, ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించా లని సూచించారు. ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్‌లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షిం చాలని సీఎస్ సూచిం చారు.రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం విక్రయించినప్పటికీ, కనీస మద్దతు ధరతో పాటుప్రభుత్వం ప్రకటిం చిన క్వింటాలుకు రూ. 500 బోనస్ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.కనీస మద్ద తు ధర కంటే తక్కువ కు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోకుండా చూడాలని స్పష్టం చేశారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనుగోళ్లకు సిద్ధంగా ఉంచాలని, రైతులం దరి వివరాల నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశిం చారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ధాన్యం సేకరణ ప్రక్రియను కలెక్టర్లు నిరంతరం పర్యవే క్షించాలని సూచిం చారు.విద్యాశాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థులు, ఉపాధ్యాయు లు, ఇతర సిబ్బంది హాజరుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ సూచిం చారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరును పర్యవేక్షించాలని, విద్యార్థుల హాజరు కనీసం 90 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా విద్యార్థులు, ఉపా ధ్యాయుల హాజరు శాతాన్ని క్రమం తప్ప కుండా సమీక్షించాలని తెలిపారు. ఉపాధ్యా యుల హాజరు మెరుగ్గా ఉంటే విద్యార్థుల హాజరు కూడా పెరుగు తుందని, క్రమం తప్ప కుండా పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థు ల్లో అభ్యసన సామ ర్థ్యాలు,విద్యా ప్రమాణా లు మెరుగుపడతా యని అన్నారు. విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ అభ్యసన వేదికలను సమర్థవం తంగా వినియోగించు కోవాలని సూచించారు. రూసా 2.0, పీఎం ఉషా పథకాల కింద మొత్తం 41 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 8 పనులు పూర్తయ్యాయ ని, మరో 33 పనులు పురోగతిలో ఉన్నా యని సీఎస్ తెలిపారు. మంజూరైన



నిధుల్లో ఇప్పటివరకు 41 శాతం మాత్రమే ఖర్చు చేసినం దున మిగిలిన నిధుల ను పూర్తిస్థాయిలో వినియోగించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను కూడా పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.11 వేల కోట్ల వ్యయంతో 87 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశా లల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఇప్పటివరకు రూ.625 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పనుల పురోగతిని కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్షిస్తూ నిర్మాణా లను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా రూ.1,108 కోట్లతో మంజూరైన 115 తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణ పనుల ను త్వరగా ప్రారంభించే లా చర్యలు తీసుకోవా లని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అవసర మైన భూసేకరణ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని సీఎస్ సూచించారు. భూసేకరణ కోసం అవసరమైన నిధులను కలెక్టర్ల వద్ద అందు బాటులో ఉంచినట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశిం చారు. అవసరమైతే అదనపు నిధులు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో వీధి కుక్కల సమస్యను సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అను గుణంగా పరిష్కరిం చాలని సీఎస్ సూచిం చారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఇతర జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీధి కుక్కలను గుర్తించి, నిబంధనల ప్రకారం వాటిని పునరావాస కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వీబీజీ రాంజీ కింద నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, జలసిరి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎస్సూచించారు.

కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఖరీఫ్ లో వర్షాలు అనుకూ లించడం వల్ల జిల్లాలో రైతులు అధిక విస్తీర్ణం లో వరి సాగు చేశారని, దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో వస్తున్నాయని, మంచి ధర లభిస్తోందనీ సీఎస్ దృష్టికి తెచ్చారు. అయితే ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో యాసంగిలో వరి సాగు చేయడం ఎంతమాత్రం తగదని, ప్రత్యామ్నా య పంటలు సాగు చేయాలని రైతులకు రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తు న్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగ రావు, డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఏఓ వీరస్వామి, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంగెంలో 50 ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శ్రీకారం
భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా పనులు ప్రారంభించిన సర్పంచ్ గన్నోజు వేణుగోపాల్ చారి

రంగారెడ్డి నవంబర్13, డీకే చాటింపు:- ఎల్ నినో ప్రభావం నుండి గట్టెక్కాలంటే ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవాలి, నీటి వృధాను అరికట్టాలి, నేల ఎన్న రాలే ప్రతి నీటిబొట్టును ఇంకుడు గుంతల ద్వారా ఒడిసి పట్టి భూగర్భజలాల పెంపులక్ష్యంగా సంగెం సర్పంచ్ ముందుచూపుతో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టడం ఆదర్శనీయం గ్రామంలో భూగర్భ జలాలను పెంపొందించడం, వర్షపు నీటిని సంరక్షించడమే లక్ష్యంగా కేశంపేట మండలం సంగెం గ్రామంలో 50 ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ జి. వేణుగోపాల్ చారి, కేశంపేట మండల ఎంపిడివో రవిచంద్ర రెడ్డి తో కలసి ఈ పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేణుగోపాల్ చారి మాట్లాడుతూ, నీటి సంరక్షణే మన భవిష్యత్తుకు అసలైన భరోసా అని పేర్కొన్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఈ 50 ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీరు వృథా కాకుండా భూమిలోకి ఇంకి, రాబోయే వేసవిలో నీటి ఎద్దడి తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, గ్రామస్తులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని



పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పూజా కార్యక్రమంలో పాల్గొన్నబీఆర్ఎస్ నేతలు
-కర్ణాటక రాష్ట్రం రైచూర్లో పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే... -పాల్గొన్న కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ముదిరాజ్, జ్యోతి తదితరులు... -మాజీ ఎమ్మెల్యేపై వల్లమాలిన ప్రేమ ఆ..ఇద్దరు మహిళ నేతలకు...!

నారాయణపేట,(డీకే చాటింపు): ఆ..ఇద్దరు మహిళ నేతలు మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డితో ముందు నుంచి ఎంతో ఆత్మీయతతో కొనసాగుతున్నారు.మాజీ ఎమ్మెల్యే కర్ణాటక రాష్ట్రం రైచూర్ లో ఏ కార్యక్రమాన్ని నిర్వహించిన ఈ మహిళ నేతలు మాత్రం తప్పని సరిగా హాజరవుతారు.మాజీ ఎమ్మెల్యే అంటే ఆ..ఇద్దరి మహిళ నేతలకు మొదటి నుంచి వల్లమాలిన ప్రేమ అని చెప్పవచ్చు..!అలాగే ఆ ఇద్దరు మహిళ నేతల పట్ల కూడా మాజీ ఎమ్మెల్యే అదే గౌరవంతో ఆత్మీయ పలకరింపుతో ముందుకెళ్తున్నారు..!దాంతో ఈ మహిళ నేతలతో మాజీ ఎమ్మెల్యేకు విడదీయరాని అనుబంధం ఏర్పడింది..

అధికారంలో ఉన్న.. లేకపోయినా..మా నేత ఎస్. రాజేందర్ రెడ్డి అని గర్వంగా చెప్పుకునే వారిలో ఈ ఇరువురు మహిళ నేతలు ముందుంటారని చెప్పవచ్చు..!! నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి కార్తీక మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం కర్ణాటక రాష్ట్రం రాయచూరులో తమ నివాసంలో చేపట్టిన పూజా కార్యక్రమానికి నారాయణపేట నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎందరో నేతలు తరలి వెళ్లారు.ఇందులో నారాయణపేట మున్సిపల్ బీఆర్ఎస్ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ,

నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,మాజీ కౌన్సిలర్ జ్యోతి ఉన్నారు. కార్తీక మాసంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో పెద్ద ఎత్తున పూజ కార్యక్రమాన్ని నిర్వహించడంతో బిఆర్ఎస్ పార్టీ నేతలతో పాటు ప్రజాప్రతినిధులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు



స్వీకరించారు.పూజ అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ అధినేత చేపట్టే ఏ కార్యక్రమానికైనా తాము ముందు ఉంటామని నారాయణపేట మున్సిపల్ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ మాజీ కౌన్సిలర్ జ్యోతి వెల్లడించారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శనివారం,నవంబర్,14, 2026

తోలుబొమ్మలాట కనుమరుగేనా..?

సినిమాలు, టి.వి.లు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసిపోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధానమైనది. తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట.ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించవచ్చు. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు. మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్త్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింప బడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు,తోలుబొమ్మ లాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు. విద్యుత్ సౌకర్యం అభివృద్ధి చెందిన తర్వాత ఎక్కువ కాంతిని ఇచ్చే విద్యుత్ బల్బులను వాడుతున్నారు.



నిర్ణీత గడువు లోపు నిర్మాణాలను పూర్తి చేయాలి

బోధన్ పట్టణ అభి వృద్ధిపై సమీక్షించిన ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 13 (డీకే చాటింపు): బోధన్ పట్టణ అభి వృద్ధి పనులపై ఆర్డీఓ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి కలెక్టర్ ఇలా త్రిపాఠి తో కలిసి అధికారులతో సమీక్షనిర్వహించారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన పనుల ప్రగతిని,అమృత్ పథకం,టీయూఎఫ్ఐ డీసీ నిధులతో చేపడు తున్న పనుల వివరా లు అడిగి తెలుసు కున్నారు. ప్రజలకు మరింత మెరుగైన సదుపాయాలు కల్పిం చేందుకు ఉద్దేశించిన అభివృద్ధి పనులను వేగంగా చేపట్టాలని, నిర్దేశిత గడువు లోపు నాణ్యతతో పూర్తి చేసేలా నిశిత పర్యవే క్షణ జరపాలని ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధికారుల కు సూచించారు. తాగు నీటి సరఫరా పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పైప్ లైన్ల మరమ్మతులు, లీకేజీ లను అరికట్టడం, ట్యాంకుల నిర్మాణా లను యుద్ధ ప్రాతిపది కన పూర్తి చేయించా లని అన్నారు. బోధన్ మున్సిపల్ పట్టణం పరిధిలో కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు నీటిని అందిస్తున్నందున నీటి సరఫరా సమయాన్నిగంటపాటు కొనసాగించాలని సూచించారు. రానున్న రోజుల్లో నీటి సరఫరా కు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతా లను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నా య ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అవసర మైతే వ్యవసాయ బోర్ల ను అద్దెకు తీసుకుని నీటి సరఫరా చేసేందు కు వీలుగా ప్రైవేటు బోర్లనుగుర్తించాలన్నారూ.మున్సిపల్ కార్యా లయ నూతన భవన సముదాయం నిర్మాణానికి టెండర్ ప్రక్రియను పూర్తి చేయా లనిఆదేశించారు.డంపింగ్ యార్డు నిర్వహ ణ,బయో మైనింగ్ సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి, ఇతర ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను మైల్ స్టోన్ ప్రకారం జరిగేలా పర్య వేక్షణ చేయాలని ఇంజి నీరింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల ల్లో మౌలిక వసతుల కల్పన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని,ప్రతిస్కూల్లోతప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉండాలన్నారు.సమీక్షా సమావేశంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ పద్మా శరత్ రెడ్డి, అద నపు కలెక్టర్ భుజంగ రావు, ఆర్డీఓ విజయ కుమారి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఆర్ అండ్ బీ ఎస్.ఈ అజ్మీరారాము, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందే సమానాభివృద్ధి కోసం

పీసీసీ చీఫ్ మహేష్ కుమార్



(డీకే చాటింపు,హైదరాబాద్): నగరంలో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ -- ఎకనామిక్ జస్టిస్‌పై మహేష్ కుమార్ గౌడ్ ప్రసంగించారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందే సమాన అభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసమేనని ఆయన స్పదతం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి ఫలాలు అందించడమే ప్రజాపాలన లక్ష్యమన్నారు. ఆదిలాబాద్, ములుగు, నారాయణపేటలోనూ పరిశ్రమలు రావాలని ఆయన అభిప్రాయపడ్డారు.రాష్ట్ర ఆదాయంలో 40 శాతం హైదరాబాద్ నుంచే ఇదీ అభివృద్ధిలో అసమతుల్యతకు నిదర్శనమని తెలిపారు. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకం ప్రారంభమైందని ప్రస్తావించారు.పేదలకు 100 రోజుల ఉపాధి కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యమన్నారు. అద్భుతమైన ఉపాధి హామీ పథకాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం కేంద్రం చేస్తున్నదని విమర్శించారు.సంపన్నులకే మోదీ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదన్నారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలన్నదే నెహ్రూ ఆశయమని మహేష్ కుమార్ గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 80 వేలకు పైగా ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు.తెలంగాణ ఉద్యమమే ఉద్యోగాల ఆకాంక్షతో సాగిందని, ఉద్యోగాల కల్పనే మా ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేసారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని, గత ప్రభుత్వ అప్పులకు ఏటా రూ.6,500 కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నామని వివరించారు. అప్పుల భారం ఉన్నా సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తున్నామని,సంపన్నులు తినే సన్నబియ్యం పేదలకు కూడా అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ జరుగుతున్నదన్నారు ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చే ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల సాయం అందిస్తునామన్నారు ఇందిరమ్మ ఇళ్లలోనే పేదలతో దీపావళి వేడుకలు జరుపుకున్నామని,పేదల కళ్లల్లో సొంతింటి ఆనందం చూడటమే ప్రజాపాలన లక్ష్యమని,దాదాపు 70 శాతం కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,ప్రభుత్వ సంక్షేమ పథకాలపై తెలంగాణ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పీసీసీ చీఫ్ తెలిపారు.సోషల్ మీడియాలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని,ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమన్నారు.

30 న తుది ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ప్రక్రియ విజ యవంతానికి తోడ్పా టును అందించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 13 (డీకే చాటింపు): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ూ×=) తుది దశకు చేరిందని, ఈ ప్రక్రియ పూర్తి స్థాయిలో విజయ వంతం అయ్యేందుకు రాజకీయ పార్టీలు తోడ్పాటును అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచిం చారు.ఐడీఓసీలో శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న చర్యలు, తదుపరి కార్యాచరణ గురించి వివరించారు. ఈ 26వ తేదీ వరకు అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందని, నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచు రణ అవుతుందని తెలిపారు.ముసాయిదా ఓటర్ల జాబితాలో అబ్సెంట్, షిఫ్ట్, డెత్, డూప్లికేషన్ (ఏ.ఎస్.డీ.డీ) కారణాలతో పేర్లను తొలగించబడిన వారికి ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం మరోమారు అవకాశం కల్పించబడుతోందని కలెక్టర్ తెలిపారు. ఏ.ఎస్.డీ.డీ జాబితా లో ఉన్న వారికి తాజాగా ఎన్యూమ రేషన్ ఫారం తో పాటు అనేగ్జర్ – బి, అనేగ్జర్ – సి లను అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియో జకవర్గాల పరిధిలో పోలింగ్ కేంద్రాల వారీ గా బీ.ఎల్.ఓలు ఇళ్లకు వెళ్లి వారికి అందించేలా చర్యలు తీసుకున్నా మని కలెక్టర్ వెల్లడిం చారు. ఈ ప్రక్రియకు ఆయా రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగించబడకూడదనే లక్ష్యంతో ఎన్నికల సంఘం ఏ.ఎస్.డీ.డీ జాబితాలో ఉన్న వారి విషయంలో మరో మారు అవకాశం కల్పి స్తోందని అన్నారు. ఎక్కడైనా అర్హులైన వారి పేరు పొరపాటుగా తొలగించబడితే, ఈ ప్రక్రియ ద్వారా తుది జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు. ఆబ్సెంట్, షిఫ్ట్, డూప్లికే షన్ జాబితాలో ఉన్న వారిని వ్యక్తిగతంగా, ఎస్.ఎం.ఎస్ లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిం చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

32వ రోజు కు చేరిన నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమ్మె

ఏ ఎన్ ఎం ల నిరాహార దీక్షలు

నిజామాబాద్ ప్రతినిధి నవంబర్13(డీకే చాటింపు):శుక్రవారం తో నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమ్మె 32 రోజులకు చేరింది. నేషనల్ హెల్త్ మిషన్ జేఏసీ ఉద్యోగుల సమ్మె32వ రోజుకు చేరిన 17 వేల మంది ఉద్యోగుల ఆర్త నాదాలు ప్రభుత్వానికి వినబడడం లేదా అని అన్నారు. ఆరోగ్య శాఖ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడి నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు స్కేల్ పోస్ట్ ఇవ్వాలని, కుటుంబ ఆరోగ్య కార్డు అందించాలని,
మహిళలకు ప్రసుతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శిబిరంలో ఏఎన్ఎంలు నిరాహార దీక్షలు చేపట్టారు. జేఏసీ నాయకులు కమిషనర్ గారిని కలవడానికి హైదరాబాద్ తరలి వెళ్లారు.



టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమం



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 13 (డీకే చాటింపు): టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమా న్ని నిజామాబాద్ IDOC కార్యాలయంలో గల జిల్లా విద్యాశాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. టీఎన్జీవో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గౌరవ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ విచ్చేసి ఆయా శాఖల ఉద్యోగుల సమస్యలపై చర్చించిన అనంతరం,2026-27 సం. నికి గాను టీఎ న్జీవో సభ్యత్వాన్ని సదరు శాఖ ఉద్యోగు లకు అందజేసి, టీఎన్జీ వో సభ్యత్వం యొక్క ప్రాముఖ్యతను వివ రించి,ఇతర సమస్యల పై సుదీర్ఘంగా చర్చించి, ఉద్యోగుల సమస్యలే పరమావధిగా భావిస్తు న్న టీఎన్జీవో సంఘం, ప్రతి ఉద్యోగికి యెల్ల వేళల్లో అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలియ జేశారు.టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్ మరియు టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ూవీ.హుసేని (ముజీబ్)ఆదేశానుసారం సభ్యత్వ నమోదు జిల్లాల చేపట్టినట్లు వివరించారు. ఇట్టి సమావేశానికి టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీని వాస్, జిల్లా కోశాధికారి నిరంజన్ గౌడ్, ఉపాధ్య క్షులు శివకుమార్, టీఎన్జీవో అర్బన్ యూ నిట్ అధ్యక్ష కార్యదర్శు లు జాకీర్ హుస్సేన్, మారుతి, విద్యాశాఖ ఫోరం అధ్యక్ష కార్య దర్శులు అశ్విన్ కుమార్, శోభన్, టీఎన్జీ వో ముఖ్య సలహాదారు లు వనమాల సుధాకర్ మరియు వ్యవసాయ శాఖ ఫోరం జిల్లా కార్యదర్శి గోవర్ధన్ మరియు ఆయా శాఖల ఉద్యోగులు, మహిళా ఉద్యోగ సోదరీమణులు హాజరై టీఎన్జీవో సభ్యత్వాన్ని స్వీకరించారు.

మాట్లాడే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలి

కేటీఆర్‌కు మహేశ్ కుమార్ కౌంటర్



(డీకే చాటింపు,హైదరాబాద్):కేటీఆర్ మాట్లాడే ముందు పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు, వాటి అమలుపై ఆత్మపరిశీలన చేసుకోవాలని పిసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ సూచించారు.దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి ఉప ముఖ్యమంత్రిగా చేసి రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించిన చరిత్ర బీఆర్ఎస్ దని ఆయన విమర్శించారు.హైడ్రా పేరుతో ఇళ్ల కూల్చివేతలంటూ కేటీఆర్ ఎక్స్‌లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.ఒక్క ఇల్లు కూల్చినట్లు నిరూపించినా చర్చకు సిద్ధంగా వున్నామని సవాల్ విసిరారు.బీఆర్ఎస్‌కు ప్రజాదరణ తగ్గిపోతోందనడానికి ఇటీవల నిర్మల్‌లో జరిగిన సభే నిదర్శనమని ఇద్దేవాచేశారు.
భారత్ సమ్మిట్ విజయాన్ని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు రాజకీయాలు చేస్తున్నారని మహేష్ కుమార్ ఆరోపించారు.భారత్ సమ్మిట్‌పై బీఆర్ఎస్ నేతల విమర్శలు అసూయతో కూడుకున్నవన్నారు.మోదీ ప్రభుత్వం జర్నలిస్టుల వీసాలను రద్దు చేయడం ప్రపంచవ్యాప్తంగా ఖండించాల్సిన అంశమని ప్రస్తావించారు. జర్నలిస్టుల వీసాల రద్దును ప్రపంచవ్యాప్తంగా ఉన్న మీడియా ప్రతినిధులు ఖండించాలని కోరారు.

ఈ నెల 16న ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహణ

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంచిర్యాల్ (డీకే చాటింపు): తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీన (సాధారణ ప్రజావాణితో పాటు) ప్రత్యేకంగా "పిల్లల ప్రజావాణి" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాలలకు సంబంధించిన వ్యక్తిగత, సామాజిక సమస్యలు, ఇబ్బందులు, ఇతర ఫిర్యాదులను స్వీకరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని జిల్లాలోని బాలబాలికలు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులు సద్వినియోగం చేసుకొని, పిల్లలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులను ప్రజావాణి కార్యక్రమంలో తెలియజేయవచ్చని వివరించారు.



శివాలయం ధ్వజస్తంభం, మహా కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నకోలన్ శంకర్ రెడ్డి బీజేపీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్



మహేశ్వరం (డీకే చాటింపు) మీర్పేట్ 60 వ డివిజన్ తిరుమలనగర్ లోని శివాలయం ధ్వజస్తంభం, మహా కుంభాభిషేకం కార్యక్రమం లో కోలన్ శంకర్ రెడ్డి బీజేపీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ కన్వీనర్ పాల్గొని దైవదర్శనం చేసుకొనడం జరిగినది.

అనంతరంఈకర్యక్రమములో కాలనీ సంక్షేమ సంఘ నాయకులు , బీజేపీ రాష్ట్ర నేత ను శాలువాతో సన్మానించడం జరిగినది బిజెపి నేతలు ఎం జయకాంత, జి దామోదర్ రెడ్డి కాలనీ వాసులు సత్యం , కాశప్ప, ప్రసాద్ , రామకృష్ణ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు

పవిత్ర కార్తీక మాస దీక్షలో స్వాములు సేవలతో తరిస్తున్న భక్తులు



ఎల్బీనగర్, నవంబర్13, డీకే చాటింపు:-కార్తీక మాసం మహిమాన్వితుడైన శ్రీ పరమేశ్వర అనుగ్రహం కోసం పూజింప తగిన పవిత్ర రోజులు. ఈ సందర్భంగా శివదీక్షలు చేపట్టి నియమ నిష్ఠలతో కఠోర దీక్ష సాధనలో స్వామి వారిని సేవించడం జరుగుతుంది. ఈ పవిత్ర మాసంలో దీక్ష కోసం మరో ఐదుగురు శివ స్వాములు మాల ధారణ చేయడం జరిగిందనీ ఆలయ చైర్మన్శివగురు స్వామి సతీష్ కుమార్ గౌడ్ శ్రీ మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో నూతన దీక్షకులకు నియమాలను వివరించి మాలధారణ చేయడం జరిగిందనీ తెలియజేశారు.

నాణ్యమైన ఔషధాలే ప్రజారోగ్యానికి భరోసా...



ఔషధ తయారీ సంస్థల్లో జరిగే ప్రతి తనిఖీ, ప్రయోగశాల పరీక్ష, నియంత్రణ సంస్థలు తీసుకునే ప్రతి నిర్ణయం నేరుగా రోగుల ఆరోగ్యం పై ప్రభావం చూపుతుందని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్డీఏ) ఇండియా కార్యాలయం కంట్రీ డైరెక్టర్ గ్రెగరీ స్మిత్ పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు శాస్త్రీయ విధానాలు, అంత ర్జాతీయ సహకారం, నాణ్యమైన తనిఖీ వ్యవస్థ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలన ఆధ్వర్యంలో అమెరికా ఫార్మకోపియా, ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన 'నాణ్యమైన ఔషధాల భరోసా ? నియంత్రణ, ప్రమాణాలు, తనిఖీల్లో శాస్త్రీయ విధానం' అంశంపై వర్క్షాప్లో ఆయన మాట్లా డుతూ.. అమెరికా ఎఫ్డిఏ పర్యవేక్షణలో ఉన్న ఔషధ తయారీ కేంద్రాల్లో సగానికి పైగా అమెరికా వెలుపలే ఉన్నాయని, అందులో భారత్ కీలక భాగస్వామిగా నిలుస్తోందన్నారు. అమెరికాకు ఎగుమతి అయ్యే ఔషధాల తయారీలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని,రాష్ట్రంలో యూఎస్ ఎఫ్డిఏ ఆమోదం పొందిన 119 ఔషధ తయారీ కేంద్రాలు ఉండటం ఫార్మా రంగ సామర్థ్యానికి నిదర్శనమని తెలిపారు. తనిఖీల్లో సాధారణంగా విధివిధానాల అమలులో లోపాలు, సమగ్ర విచారణ లేకపోవడం, ప్రయోగశాల నియంత్రణల్లో బలహీనతలు కనిపిస్తున్నా యని పేర్కొన్నారు. ఇటువంటి అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఔషధ నాణ్యతను కాపాడడంలో శాస్త్రీయ ప్రమాణాల అమలు అత్యంత కీలకమన్నారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ వర్క్షాప్ను ప్రారంభిస్తూ.. వ్యాపార నిర్వహణను సులభతరం చేసేందుకు నిబంధనలను సరళీకరిస్తున్నప్పటికీ, మందుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తయారయ్యే ఔషధాలు ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్నందున నియంత్రణ అధికారుల బాధ్యత మరింత పెరిగిందన్నారు. నాసిరకం మందుల విషయంలో ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికా ఫార్మకోపి యా ఇండియా సైట్ హెడ్ డాక్టర్ గిరీష్ కపూర్, ఆల్ ఇండియా డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్, ఎపి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎం. పాండురంగ ప్రసాద్, ఇన్స్పెక్టర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో..

కాలపరిమితి దాటిన ఫైళ్లు తొలగింపు

-ఉన్నతాధికారుల ఆదేశాలతో తొలగింపు... -త్వరలో నాశనం చేసే ప్రక్రియను చేపట్టనున్న అధికారులు... - నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గడువు ముగిసిన ఫైళ్ల జాబితా తయారు... -ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గడువు ముగిసిన ఫైళ్ల తొలగింపు ప్రక్రియ... -నారాయణపేట ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ ఏ.రాజేష్...







నారాయణపేట,(డీకే చాటింపు): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కాలపరిమితి దాటిన ఫైళ్లను తొలగించేందుకు ఆ శాఖ అధికారులు తాజాగా చర్యలు చేపట్టారు.సాధారణ పరిపాలన,తాత్కాలిక అవసరాలకు సంబంధించిన ఫైళ్లను నిర్ణీత గడువు ముగిసిన తర్వాత తొలగిస్తారు.అందులో భాగంగా కొన్ని ఫైళ్లు సంవత్సరంలోపు,మరికొన్ని మూడు సంవత్సరాలు,ఐదు సంవత్సరాలు,పది సంవత్సరాల పైబడిన ఫైళ్లను తొలగించేందుకు సబ్ రిజిస్ట్రార్ అధికారులు చర్యలు చేపట్టారు. 1నుంచి 3 ఏళ్లు..సాధారణ ఉత్తర ప్రత్యుత్తరాలు,దరఖాస్తుల రసీదులు,టపా రిజిస్టర్లు, తదితర ఫైలను గడువు తర్వాత తొలగిస్తారు.అలాగే 5 నుంచి10 ఏళ్లు..ఆడిట్ అభ్యంతరాలు లేని సాధారణ ఖాతాల పుస్తకాలు,చలానా రసీదుల కౌంటర్ ఫాయిల్స్, వివాదాలు లేని తాత్కాలిక ఫైళ్లను పరిశీలించి తొలగిస్తారు.పాత ఫైళ్ల తొలగింపు ప్రక్రియ నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రికార్డు రూమ్ లో భద్రపరిచిన వివిధ ఫైళ్లను బయటికి తీశారు.వీటిని త్వరలో నాశనం చేసే ప్రక్రియ చేపడతారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం సబ్ రిజిస్ట్రార్ నేరుగా ఏ ఫైలునూ చింపివేయడానికి లేదా కాల్చివేయడానికి వీలులేదు.

దీనికి ఒక అధికారిక పద్ధతి ఉంటుంది.జాబితా తయారీ, గడువు ముగిసిన ఫైళ్ల వివరాలతో ముందుగా ఒక జాబితా తయారు చేస్తారు. ఉన్నతాధికారుల అనుమతితోనే ఈ జాబితాను జిల్లా రిజిస్ట్రార్ లేదా రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్స్పెక్టర్ జనరల్ ఆమోదానికి పంపుతారు. అనుమతి వచ్చిన తర్వాత అధికారుల సమక్షంలో వాటిని నాశనం చేసి,రికార్డు రూమ్ రిజిస్టర్లో ఆ వివరాలను నమోదు చేస్తారు.ఇందులో భాగంగా నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గడువు ముగిసిన ఫైళ్ల జాబితా వివరాలను అధికారులు ఈమెరకే సిద్ధం చేశారు.ఈ జాబితా వివరాలను జిల్లా అధికారులకు అందజేశారు. వారి అనుమతితో వాటిని నాశనం చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.రికార్డు రూమ్ నుంచి తొలగించిన గడువు ముగిసిన ఫైళ్లను ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ ఛాంబర్ లోనే భద్రపరిచారు. ఉన్నతాధికారులు ఏ రోజైతే తేదీ ఖరారు చేస్తారో ఆరోజు అధికారుల సమక్షంలోనే ఆఫైళ్లను కాల్చివేసే అవకాశం ఉంది.ఈ విషయంపై నారాయణపేట ఇన్చార్జి సబ్ రిజిస్ట్రార్ ఏ.రాజేష్ శుక్రవారం డీకే చాటింపు ప్రతినిధితో మాట్లాడుతూ గడువు ముగిసిన ఫైళ్ల వివరాలను ఈమెరకే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.వారి అనుమతితోనే వీటిని కాల్చివేస్తామని ఆయన తెలిపారు.నాశనం చేసేందుకు బయటికి తీసిన గడువు ముగిసిన ఫైళ్లు పెద్ద ఎత్తున కార్యాలయంలో కాన వచ్చాయి.

శారద నగర్ కాలనీలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ -- గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దెల సునీల్ బాబు



ఎల్బీనగర్ (డీకే చాటింపు) గడ్డి అన్నారం డివిజన్ పరిధిలోని శారద నగర్ కాలనీలో పర్యటించిన గడ్డి అన్నారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మద్దెల సునీల్ బాబులి , కాలనీవాసులతో మాట్లాడి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గత కొన్ని రోజులుగా మ్యాన్హోల్ కవర్ పగిలిపోవడంతో మురుగునీరు బయటకు వచ్చి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను గుర్తించిన వెంటనే మద్దెల సునీల్ బాబు సంబంధిత జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారులి . స్పందించిన అధికారులు పగిలిపోయిన మ్యాన్ హోల్ కవర్ స్థానంలో నూతన కవర్ను ఏర్పాటు చేయడంతో కాలనీవాసులకు ఉపశమనం లభించింది.కాలనీలోని పలు రోడ్లపై గుంతలు ఏర్పడి వాహన దారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా రాకపోక లకు అంతరాయం కలుగుతోందని కాలనీవాసులు తెలియజేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి రోడ్లపై అవసరమైన ప్యాచ్వర్క్ పనులు చేపట్టాలని కోరారు. అధికారులు కూడా సానుకూలంగా స్పందించి అతి త్వరలో ప్యాచ్వర్క్ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యలే ప్రథమ ప్రాధాన్యతగా భావిస్తూ, ప్రజలకు ఎక్కడ ఏ సమస్య ఎదురైనా నా దృష్టికి తీసుకువస్తే సంబం ధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాను. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నా ప్రధాన లక్ష్యం ఈ సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించి సహకరించిన జీహెచ్ఎంసీ

క్షేత్రస్థాయిలో లక్ష్యం మేరకు పనిచేయాలి



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 13 (డీకే చాటింపు):

రెంజల్ నవీపేట్ మండల పరిధి లో నాన్ ఫార్మింగ్ సెక్టార్ స్థాయిలో లక్ష్యం మేరకు పనులు పూర్తి చేయాలని నాన్ ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజర్ మోహన్ రివ్యూ సమావేశంలో తెలిపారు. సీసీలు సిఆర్పిలు సిబ్బందితో రివ్యూ సమావేశం జరిపారు. ఇందులో ఎంటర్ప్రెజెస్, ఇంకుబేటర్, ఐ ఈ ఎల్ ఎల్, డి పి ఆర్ ప్రిపరేషన్, సి ఈ ఎఫ్ రికవరీ, నాన్ సి ఈ ఎఫ్,ఉద్యశీ రిజిస్ట్రే షన్ పైన రివ్యూ తీసుకోవడం జరిగింది. మరియు ఎస్ వి ఈ పి నుండి ఇచ్చిన జజుఖీ గ్రౌండ్లింగ్ వెరిఫికేషన్ చేశారు. ఇందులో మండలానికి సంబం ధించిన ఏటీఎంలో మెంటర్లు సి ఆర్ పి లు పాల్గొన్నారు.

ఆడపిల్లల జనన నిష్పత్తిని మెరుగుపరచాలి గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టాలి

-జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి,కమిటీ చైర్మన్ డాక్టర్ కె.జయచంద్ర మోహన్... -గర్భధారణ పూర్వ,గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సమావేశం...





నారాయణపేట,(డీకే చాటింపు): గర్భధారణ పూర్వ,గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై శుక్రవారం నారాయణపేట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా సలహా కమిటీ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి,కమిటీ చైర్మన్ డాక్టర్ కె.జయచంద్ర మోహన్ అధ్యక్షత వహించారు.ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ సిద్ధప్ప, గైనకాలజిస్ట్ డాక్టర్ అమిత, పీడియాట్రిషియన్ డాక్టర్ రాకేష్,ఎంహెచ్ఎన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కిష్టమ్మ,సఖి సెంటర్ ఎన్జీవో ప్రతినిధి క్రాంతి రేఖ, సోషల్ వర్కర్ హజమ్మ, ఎంహెచ్ఎన్ కోఆర్డినేటర్ అరవింద్,రాజన్న ఎంపీహెచ్ఈఓ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గర్భధారణ పూర్వ,గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలు,గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టడం,భ్రూణ హత్య నివారణ,అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలపై చట్ట ప్రకారం పర్యవేక్షణ, ఆడపిల్లల పట్ల సమానత్వ భావన పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కె.జయచంద్ర మోహన్ మాట్లాడుతూ ఆడపిల్లల జనన నిష్పత్తిని మెరుగుపరచడానికి,గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టడానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య నిపుణులు,స్వచ్ఛంద సంస్థలు,సంబంధిత శాఖల ప్రతినిధులు సమస్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని,ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.

భారత్ నుంచి డీజిల్ దిగుమతులపై ఉక్రెయిన్ ఆంక్షలు

న్యూడిల్లీ, : భారతదేశం నుంచి చేసుకుంటున్న డీజిల్ దిగుమతులపై ఆంక్షలు విధించాలని ఉక్రెయిన్ నిర్ణయించింది, అక్టోబర్ 1 నుంచి ఇది అమలులోకి రానుంది. రష్యా నుంచి ముడి చమురుపై ఆధారప డటంపై ఆందోళనలు చెలరేగాయి. ఉక్రేనియా ఎనర్జీ కన్సల్టెన్సీ ఎన్కోర్ ప్రకారం.. ఉక్రేనియా భద్రతా సంస్థలు భారతదేశం నుంచి వచ్చే ప్రతి డీజిల్ దిగుమతిని రష్యా మూలమైన భాగాలను గుర్తించడా నికి ప్రయోగశాల పరీక్షలు చేపట్టాలని ఆదేశించాయని కన్సల్టెన్సీ పేర్కొంది., శక్తి కన్సల్టెన్సీ ం-95 గతంలో ఈ వేసవిలో ఒక ప్రధాన ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారం మూసివేయడంతో ఇంధన వ్యాపారులు విదేశీ సరఫరాదారులపై ఆధారపడవలసి వచ్చిందని పేర్కొంది. రష్యా ముడి చమురును గణనీయమైన పరిమాణంలో శుద్ధి చేసే దేశాల్లో భారతదేశం ఒకటి. ం-95 ప్రకారం, ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ కూడా ఒకానొక సమయంలో భారత్ నుంచి దిగుమతి చేసుకునే డీజిల్ను సేకరించింది. ఎందుకంటే ఇది సోవియట్ అనంతర సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు గుర్తించారు. ఎన్కోర్ గణాంకాల ప్రకారం, ఒక్క ఆగస్టులోనే ఉక్రెయిన్ దేశం భారత్ నుండి 119,000 టన్నుల డీజిల్ను దిగుమతి చేసుకుంది. ఆ నెలలో మొత్తం డీజిల్ దిగుమతుల్లో ఇది 18 శాతం వాటా అని రాయిటర్స్ నివేదించింది. పరిమిత దేశీయ ఉత్పత్తిని భర్తీ చేయడానికి ఉక్రెయిన్ బెలారస్, రష్యా నుంచి ముడి చమురు, ఇంధన దిగుమతులపై ఎక్కువగా ఆధారపడింది. అయితే, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ ప్రధానంగా పశ్చిమ ఐరోపాలోని దేశాలపై ఆధార పడుతోంది. ం-95 ప్రకారం, 2025 మొదటి అర్ధభాగంలో ఉక్రెయిన్లోకి మొత్తం డీజిల్ దిగుమతులు 13 శాతం తగ్గి, 2.74 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకున్నాయి. ఉక్రేనియా చమురు శుద్ధి కర్మాగారాలు, నిల్వ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని రష్యన్ డ్రోన్ దాడులు, క్షిపణి దాడులు కొనసాగుతున్న క్రమంలో ఈ ఆంక్షలు వచ్చాయి. ఉక్రేనియా డ్రోన్లు రష్యా వాయువ్య ప్రాంతంలోని కిరిషి చమురు శుద్ధి కర్మాగారంపై ఆదివారం నాడు దాడి చేశాయి. ఇది దేశంలోనే అతి రిఫైనరీ. డ్రోన్ దాడులతో మంటలు చెలరేగాయని ఫ్రెన్స్ 24 నివేదించింది. సుర్గుట్నెఫ్టెగాజ్ లోని కిరిషినెఫ్టోర్గ్స్నేజ్ రిఫైనరీ రష్యాలోని అతిపెద్ద రెండు రిఫైనరీలలో ఒకటి. ఉక్రేనియా దోన్లు దాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని రష్యన్ అధికారులు కూడా ధృవీకరించారు.

పగడాల స్థావరాల రక్షణకు పరిశోధనలు!



హైదరాబాద్: శాస్త్రవేత్తలు ఆస్ట్రేలియా పగడాల రెమ్మలను గడ్డకట్టించి వాటి లార్వాను నిల్వచేసే ప్రక్రియను కనుగొనగలిగారు. వాతావరణ మార్పుల కారణంగా పగడాల స్థావరాలు తీవ్ర ముప్పును ఎదుర్కొంటు న్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రక్రియ వాటి ఉనికిని రక్షించుకోడానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. సముద్రపు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతుండడంతో సున్నితమైన పర్యావరణ వ్యవస్థలు అస్థిరమౌతున్నాయి. అందువల్ల పగడాల దిబ్బలను ఎలా కాపాడుకోవాలో శాస్త్రవేత్తలకు ఆందోళన కలిగిస్తోంది. గత ఏడేళ్లలో లా నినా తీవ్ర వాతావరణ ప్రభావంతో పగడాల స్థావరాలు నాలుగు సార్లు తమ రంగును ఉనికిని కోల్పోయాయి. గడ్డకట్టించే క్రయోజెనిక్ ప్రక్రియ వల్ల గడ్డ కట్టిన పగడాల రెమ్మలను నిల్వ చేసుకోవచ్చు. తిరిగి వాటిని ప్రవేశ పెట్టవచ్చు.కానీ ప్రస్తుత ప్రక్రియలో లేజర్స్ వంటి అత్యంత ఆధునిక శాస్త్ర సాంకేతికత చాలా అవసరం. అయితే శాస్త్రవేత్తలు క్రయోమెష్ విధానం లో చాలా తక్కువ వ్యయంతో పగడాల స్థావరాలను భద్రపర్చవచ్చుని చెబుతున్నారు.క్రయోమెష్ అంటే కృత్రిమంగా జాలిని తయారు చేయడం.

భారీగా పెరిగిన బియ్యం ధరలు

హైదరాబాద్:తెలంగాణలో బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ధరల పెరుగుదల మరింత ఎక్కువగా నమోదవుతోంది. ఈ పరిస్థితికి ఎల్‌నినో ప్రభావంతో పంట దిగుబడులపై నెలకొన్న ఆందోళనలు ఒక కారణమైతే,.. ప్రైవేటు వ్యాపారులు భారీగా బియ్యాన్ని నిల్వ చేయడం మరో ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం.. మే నుంచి జులై మధ్య దేశవ్యాప్తంగా బియ్యం రిటైల్ ధరలు సగటున 3.33 శాతం పెరిగాయి. అదే కాలంలో తెలంగాణలో మాత్రం 4.65 శాతం పెరుగుదల నమోదైంది. ప్రస్తుతం రాష్ట్రంలో బియ్యం సగటు రిటైల్ ధర కిలోకు రూ.52.67గా ఉండగా.. ఇది దేశ సగటుతో పోలిస్తే దాదాపు రూ.10 ఎక్కువ. ప్రముఖ రకాల సన్నబియ్యం ధరలు కిలోకు రూ.54 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు.. ఎల్‌నినో ప్రభావంతో పంటపై ఆందోళనలు నెలకొనడంతో ధరలు పెరిగాయని చెప్పారు. రానున్న నెలల్లో పంట బాగా వస్తే ధరలు మళ్లీ తగ్గే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు.అయితే ధరల పెరుగుదలకు ఎల్‌నినో ఒక్కటే కారణం కాదని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం బాగానే ఉన్నందున సరఫరాలో పెద్ద అంతరాయం లేదన్నారు. అయినప్పటికీ ధరలు పెరగడానికి ప్రైవేటు వ్యాపారుల నిల్వలు కూడా ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పొందించిన పాలసీ పత్రం ప్రకారం.. భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు, ఎరువులు-ఇంధన వ్యయాల పెరుగుదల, ఆసియా దేశాల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా ప్రపంచ మార్కెట్‌లో బియ్యం ధరలు 30 నుంచి 50 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది.పాలసీ పత్రంలో మూడు రకాల పరిస్థితులను ప్రస్తావించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న రోజుల్లో బియ్యం ధరలు అకస్మాత్తుగా ఎగబాకే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం హెచ్చరించింది.



ప్రస్తుతానికి మార్కెట్‌లో ధాన్యపు నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ.. భవిష్యత్తులో ఏర్పడే వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బియ్యం వ్యాపారాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని తాజా పాలసీ పత్రంలో స్పష్టం చేశారు. సెంటర్ ఫౌండింగ్ డైరెక్టర్ సమరేందు మొహంతి, పీజేటీఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ఆసియాలోని ప్రధాన వరి సాగు ప్రాంతాలపై ఎల్ నినో ప్రభావం పడితే, దిగుమతి చేసుకునే దేశాలు ముందుగానే నిల్వలు పెంచుకోవడానికి మొగ్గు చూపుతాయి. మధ్యస్థ ఉత్పత్తి నష్టాలు, ఆగ్నేయాసియా దేశాలు ముందు జాగ్రత్త చర్యగా నిల్వలు పెంచుకోవడం వల్ల ధరలు 30 నుంచి 50 శాతం వరకు ఎగిసే అవకాశం ఉందని చెప్పారు. తీవ్రమైన ఉత్పత్తి నష్టాలు, విస్తృతమైన ఎగుమతి నిషేధాలు, పానిక్ బైయింగ్ చోటు చేసుకుంటే మాత్రం గ్లోబల్ మార్కెట్‌లో బియ్యం ధరలు ఇప్పుడున్న ధరలకు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రపంచ బియ్యం మార్కెట్‌ను స్థిరీకరించడంలో భారత్ పాత్ర అత్యంత కీలమని అధ్యయనం స్పష్టం చేసింది. ఉత్పత్తి, ఎగుమతులు, ప్రభుత్వ ఆహార ధాన్యాల నిల్వల్లో భారత్ అగ్రగామిగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణమన్నారు.

ఎన్నికల అఫడవిట్లే ఆధారాలు

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో భూ వివాదాలు ఎప్పుడూ కేంద్రబిందువుగానే ఉంటాయి. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న రాజకీయ పరిణామాలు ఆరోపణల స్థాయిని దాటిపోయాయి. అఫిడవిట్లు, అధికారిక పత్రాల ఆధారంగా సాగుతున్న ఒక వ్యూహాత్మక దాడిలా మారా యి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ భూములు, కేటీఆర్ ఆస్తుల సంపాదనపై కాంగ్రెస్ ప్రభుత్వం పావులు కదుపుతున్న తీరు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రత్యేకించి గత ఎన్నికల అఫిడవిట్లను ప్రస్తుత వాస్తవాలతో బేరీజు వేస్తూ అధికార పార్టీ సంధిస్తున్న ప్రశ్నలు బీఆర్ఎస్ ను డిఫెన్స్‌లో పడేశాయి.రాజకీయ నాయకుల గతం, వర్తమానం మధ్య వ్యత్యాసాన్ని ఎత్తిచూపడానికి ఎన్నికల సంఘానికి సమర్పించే అఫిడవిట్లే అత్యంత ప్రామాణికమైన ఆయుధాలుగా మారుతుంటాయి. ప్రస్తుత వివాదంలోనూ కాంగ్రెస్ పార్టీ ఇదే వ్యూహాన్ని అమలు చేస్తోంది. 2004లో కరీంనగర్ లోక్‌సభ స్థానం నుండి పోటీ చేసిన సమయంలో కేసీఆర్ సమర్పించిన అఫిడవిట్‌లో తనకు కనీసం ఒక్క ఎకరం వ్యవసాయ భూమి కూడా లేదని స్పష్టంగా పేర్కొన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 2009 ఎన్నికల అఫిడవిట్‌లో కేవలం ఒక ఎకరం భూమి మాత్రమే ఉన్నట్లు చూపించారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు..కానీ తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పదేళ్ల అధికార కాలం ముగిసేనాటికి ఈ కుటుంబం చేతిలో వేల ఎకరాల భూములు, వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా సమకూరాయనేది ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశమైంది. ఉద్యమ సమయంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని, ప్రాణాలర్పించిన అమరుల త్యాగాల పునాదుల మీద ఎదిగిన నేతలు, ఇంత భారీ స్థాయిలో సంపదను ఎలా



కూడబెట్టారంటూ కాంగ్రెస్ సంధిస్తున్న ప్రశ్నలు రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ నిర్వహణపై అప్పట్లోనే విపక్షాలు అనేక విమర్శలు చేశాయి. అయితే ఇప్పుడు అదే ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములు, పేదల భూములు, దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములు కూడా అన్యాక్రాంతమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ అంశంపై కేవలం మాటల యుద్ధానికే పరిమితం కాకుండా.. సెక్షన్ 22ఏ కింద ఉన్న వివాదాస్పద భూముల వ్యవహారంపై అధికారికంగా రెవెన్యూ విచారణకు ఆదేశించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ పైచేయి సాధించింది.అసెంబ్లీ వేదికగా కూడా దీనికి సంబంధించిన పత్రాలను, రికార్డులను ప్రదర్శించి బీఆర్ఎస్ అధినేతను ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్‌ను 'భూబకాసురుడు' అంటూ మంత్రి పొంగులేటి అభివర్ణించడం, కేటీఆర్ తన అమెరికన్ సక్సెస్, వంశపారంపర్య ఆస్తుల గురించి చేసిన ప్రకటనలను తప్పుపట్టడం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఈ అంశం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది.

ప్రీతిరెడ్డికి కమలమే ఛాయిస్

హైదరాబాద్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత చామకూర మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి క్రమంగా మేడ్చల్, మల్కాజిగిరి పరిధిలో తన రాజకీయ యాక్టివిటీని వేగవంతం చేస్తున్నారు. నియోజకవర్గంలో సొంత వర్గంతో ప్రత్యేక పర్యటనలు, జాతీయవాద భావజాలం ప్రతిబింబించేలా విద్యాసంస్థల్లో కార్యక్రమాలు, కమలనాథులతో తరచూ సత్సంబంధాలు కొనసాగిస్తుండటం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో ఊహాగానాలు, స్థానిక నేతల విభేదాల నడుమ ఆమె చూపు బీజేపీ వైపే ఉందన్న సంకేతాలు బలంగా వినిపిస్తుండటంతో.. మల్లారెడ్డి ఫ్యామిలీ నుంచి త్వరలోనే ఒకరు కమలం గూటికి చేరడం దాదాపు ఖాయమనే ప్రచారం సాగుతోంది.ప్రీతిరెడ్డి బీజేపీ బాట పడితే పార్టీలో సరికొత్త రాజకీయ చిక్కులు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం నుంచి ప్రస్తుతం ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒకవేళ మల్లారెడ్డి కుటుంబం తమ పొలిటికల్ ఫ్యూచర్ కోసం బీజేపీ లోక్‌సభ టికెట్ సీనియర్ నేత ఈటల రాజేందర్ భవిష్యత్ ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. గతంలో హుజూరాబాద్ ప్రాతినిధ్యం వహించిన ఈటల, రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి మళ్లీ తన పాత నియోజకవర్గానికి పరిమితమవుతారా లేక మల్కాజిగిరి కేంద్రంగానే తన పట్టు నిలుపుకుంటారా అనేది కమలం పార్టీలో ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది.మరోవైపు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగితే భవిష్యత్తులో గెలుపు అవకాశాలు ఏమాత్రం ఉంటాయనే దానిపై మల్లారెడ్డి కుటుంబంలో అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధికారంలో లేకపోవడం, గులాబీ కేడర్‌లోనూ నిస్తేజం ఆవహించడంతో బీఆర్ఎస్ టికెట్ ఖాయమైనా



విజయావకాశాలు తక్కువేనని వారు భావిస్తున్నట్లు సమాచారం. అందుకే, ప్రాంతీయ పార్టీల కంటే జాతీయ స్థాయిలో బలంగా ఉన్న బీజేపీని ఎంచుకోవడమే తమ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలకు రక్షణగా ఉంటుందనే వ్యూహంతోనే ఈ పావులు కదుపుతున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో విశ్లేషణలు వస్తున్నాయి.మల్లారెడ్డి కుటుంబంలో మొదలైన ఈ రాజకీయ మార్పుల తుఫాను కేవలం ఒక కుటుంబానికే పరిమితం కాకుండా, మేడ్చల్-మల్కాజిగిరి ప్రాంతంలోని గులాబీ, కమలం పార్టీల సమీకరణాలను తలకిందులు చేసేలా కనిపిస్తోంది. సొంత పార్టీ బీఆర్ఎస్‌లో భవిష్యత్తు లేదని తేల్చుకుని బీజేపీ తలుపు తడుతున్న మోస్ట్ పవర్‌ఫుల్ ఫ్యామిలీకి కమలనాథులు ఎలాంటి హామీ ఇస్తారు? ఈటల రాజేందర్ లాంటి దిగ్గజ నేత ఈ పరిణామాలను ఎలా తట్టుకుంటారు? అనేవి రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన మలుపులుగా మారనున్నాయి.

ఫాంహౌస్ లెక్కలు తేల్చేస్తారా?



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో ఏళ్ల తరబడి ఒక మిస్టరీగా, అధికార కేంద్రానికి ప్రతిరూపంగా నిలిచిన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కాంపౌండ్ ఇప్పుడు చట్టపరమైన, పరిపాలనాపరమైన చక్రబంధంలో చిక్కుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన 30 రోజుల డెడ్‌లైన్ ప్రకటన ఊరికే కాదని నిరూపిస్తూ, రెవెన్యూ యంత్రాంగం వేగంగా ఆచరణలోకి దిగింది. మార్కుక్ తహశీల్దార్ కార్యాలయంలో గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ నేతృత్వంలో సర్వేయర్లు, రెవెన్యూ ఉన్నతాధికారులు అత్యవసర సమీక్ష నిర్వహించి, ఫామ్‌హౌస్ పరిధిలోని పాత పహణీలు, భూముల క్రయవిక్రయాల రికార్డులను క్షుణ్ణంగా తవ్వితీస్తున్నారు.ఈ గ్రౌండ్-లెవల్ ఆపరేషన్ అంతిమ లక్ష్యం.. ఫామ్‌హౌస్ కాంపౌండ్ వాల్ లోపల ఉన్నది కేవలం కేసీఆర్ చెబుతున్న పట్టా భూములు మాత్రమేనా లేక దళితులకు కేటాయించిన సీలింగ్, అసైన్డ్, ప్రభుత్వ కాలువల స్థలాలు ఏమైనా ఆక్రమణకు గురయ్యాయా అనే నిర్దిష్టమైన ప్రశ్నలకు చట్టబద్ధమైన సమాధానాలు రాబట్టడమే. క్షేత్రస్థాయి డిజిటల్ ల్యాండ్ సర్వే చేపట్టడానికి ముందు చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు, భూ సర్వే నిబంధనల ప్రకారం భూ యజమానులకు ముందస్తు నోటీసులు జారీ చేయడానికి అధికారులు లీగల్ కసరత్తు పూర్తి చేస్తున్నారు. అతి త్వరలోనే కేసీఆర్‌తో పాటు సంబంధిత ప్రతినిధులకు ఈ అధికారిక నోటీసులు అందనున్నట్లు సమాచారం.ఈ పరిణామం రేవంత్ రెడ్డి సర్కార్ చేపడుతున్న ఆపరేషన్‌ను కేవలం రాజకీయ విమర్శల స్థాయి నుంచి రెవెన్యూ రికవరీ స్థాయికి తీసుకెళ్లింది. శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం లెక్కలు చూపించడమే కాకుండా, నెల రోజుల గడువు పెట్టి సిద్దిపేట జిల్లా కలెక్టర్‌ను బాధ్యుడిని చేయడంతో అధికారులు ఏమాత్రం ఉపేక్షించకుండా ఫైల్స్‌ను సిద్ధం చేస్తున్నారు. సర్వే నిర్వహణ సమయానికి భూ యజమానులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలోనే కొలతలు వేయాలని భావిస్తుండటంతో, ఎర్రవల్లి పరిసరాల్లో ముసుపెన్నడూ ఉత్కంఠ వాతావరణం నెలకొంది.ప్రతిపక్ష హోదాలో ఉన్న కేసీఆర్‌ను రాజకీయంగా నిరోధించలేక, కాంగ్రెస్ ప్రభుత్వం పాత కక్షలతోనే నోటీసులు, విచారణల పేరుతో హడావుడి చేస్తోందని మండిపడుతున్నాయి. గత పదేళ్లలో లేని భూ సమస్యలు ఇప్పుడు కొత్తగా ఎలా ఊడిపడ్డాయని, ఇది తమ అధినేత మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకు అధికార పక్షం ఆడుతున్న కక్షసాధింపు నాటకమని విమర్శిస్తున్నాయి. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములపై బురదజల్లడం కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమేనని గులాబీ నేతలు స్పష్టం చేస్తున్నారు. 30 రోజుల కాలమితిలో రెవెన్యూ యంత్రాంగం ఇచ్చే డిజిటల్ సర్వే నివేదిక ఆధారంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలకు దిగుతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణలో ఉన్నట్లు సర్వేలో తేలితే, వాటిని స్వాధీనం చేసుకుని దళితులకు పంపిణీ చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి సవాల్ నెరవేరుతుందా లేదా ఈ వివాదం సుదీర్ఘ న్యాయపోరాటానికి దారితీస్తుందా అనేది రాబోయే కొద్ది రోజుల్లో తేలనుంది.

జెన్ జీ లక్ష్యంగా యువ వికాసం

వరంగల్, : తెలంగాణ రాజకీయాల్లో నిరుద్యోగ అంశం ఎప్పుడూ ప్రధాన అంశమే. అధికారంలోకి రావడానికి ముందు యువతను ఆకర్షించేందుకు ఇచ్చిన హామీలు, ఆ తర్వాత వాటి అమలులో జాప్యం ప్రభుత్వాల పట్ల తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తుంటాయి. సరిగ్గా ఇదే కోణంలో రేవంత్ రెడ్డి సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 'రాజీవ్ యువ వికాసం' పథకం ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఎదురుచూస్తున్న ఈ ఫైలు గత కొన్ని నెలలుగా కార్యరూపం దాల్చకపోవడం అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా పెద్ద తలనొప్పిగా మారింది.స్వశక్తితో యువత వ్యాపారాలు చేసుకునేలా ఆర్థిక చేయూతనందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ స్కీమ్‌ను తెరపైకి తెచ్చింది. 6 వేల కోట్ల భారీ బడ్జెట్ కేటాయింపులతో, హైదరాబాద్‌లో భారీ హోర్డింగులతో చేసిన ప్రచారం యువతలో భారీ ఆశలను రేకెత్తించింది. అయితే, ఆచరణలోకి వచ్చేసరికి నిధుల కొరత, సిబిల్ స్కోర్ నిబంధనలు, బ్యాంకర్ల ఉదాసీనత వంటి కారణాలతో ఈ స్కీం నిలిచిపోయింది. దీనికి తోడు స్థానిక ఎమ్మెల్యేల జోక్యం, సిఫార్సుల పర్వం నడుస్తోందన్న ఆరోపణలు ప్రభుత్వ నైతికతను ఇరుకున పెట్టాయి.మాటిచ్చి అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు ఈ పథకం నిలిచిపోవడం బలాన్ని చేకూర్చింది. యువ శక్తి ఎటుపోయింది? అంటూ ప్రతిపక్షాలు ప్రతి వేదికపై నుంచి ప్రభుత్వాన్ని నిలదీస్తున్న తరుణంలో, ప్రభుత్వం పట్ల యువతలో పెరుగుతున్న అసంతృప్తిని చల్లారాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడింది.రాజకీయ విమర్శల నుంచి తప్పించుకోవడానికి, ముఖ్యంగా భవిష్యత్తు ఎన్నికల్లో కీలకమైన జెన్ జీ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి రేవంత్ సర్కార్ ఇప్పుడు మళ్లీ ఈ పథకానికి దుమ్ము దులుపుతోంది. ఇందులో భాగంగానే ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19 నుంచి ఈ పథకం ద్వారా తొలి విడత ఆర్థిక సాయం అందించేలా కసరత్తు జరుగుతోంది. వచ్చిన లక్షలాది దరఖాస్తులను పరిశీలించడం, పారదర్శకత లేకపోతే మళ్లీ విమర్శలు ఎదురుకావడం ప్రభుత్వానికి కత్తి మీద సాములాంటి విషయమే. ఇప్పటికే కొన్ని బ్యాంకులు ఇంటర్వ్యూలు పూర్తి చేసినా, క్షేత్రస్థాయిలో అమల్లో స్పష్టత కొరవడింది.హామీల అమలు విషయంలో ఎదుర్కొంటున్న వ్యతిరేకతను తిప్పకొట్టేందుకు, ప్రజా వ్యతిరేకతను తగ్గించుకునేందుకు ఈ డ్యామేజ్ కంట్రోల్ అవసరమని రేవంత్ సర్కార్ భావిస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నవంబర్ 19 నాటికి నిజంగానే నిరుద్యోగుల ఖాతాల్లో సబ్సిడీ రుణాలు జమ అవుతాయా? లేక ఇది మరోసారి రాజకీయ మైలేజ్ కోసం చేస్తున్న కాలయాపన ప్రకటన మాత్రమేనా అనేది వేచి చూడాలి.

డైవర్షన్ అండ్ అటాక్ గేమ్!

హైదరాబాద్, : తెలంగాణ రాజకీయ రంగస్థలంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న రాజకీయ అడుగులు ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి కి పెద్ద అగ్నిపరీక్షగా మారుతున్నాయి. ప్రజా సమస్యలు, పాలనా లోపాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ ప్రయత్నించిన ప్రతిసారీ.. సీఎం రేవంత్ రెడ్డి తనదైన శైలిలో అజెండాను అకస్మాత్తుగా మార్చేసి ప్రతిపక్షాన్ని డిఫెన్స్‌లోకి నెట్టడంలో విజయం సాధిస్తున్నారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన వివాదాన్ని దళిత ఆత్మగౌరవ అంశంగా మలచడం నుంచి, 22ం నిషేధిత భూముల చర్చను నేరుగా కేసీఆర్ కుటుంబ భూములపై విచారణ వైపు తిప్పడం వరకు రేవంత్ వ్యూహాత్మక అజెండా పాలిటిక్స్ నడిపిస్తున్నారు.ఈ పొలిటికల్ ట్రాప్‌లో చిక్కుకుని అసెంబ్లీ సభ నుంచి కేటీఆర్ సహా ప్రధాన బీఆర్ఎస్ నాయకులు వరుసగా సస్పెండ్ కావడంతో, ప్రతిపక్షం ఫీల్డ్‌లో ఉండి శాసనసభ వేదికగా లేవనెత్తాల్సిన ప్రజా సమస్యల అజెండా మూలనపడింది. సభలో సీఎం సుదీర్ఘ ప్రసంగం చేస్తూ, రికార్డులను బహిర్గతం చేస్తూ, రెవెన్యూ విచారణలకు ఆదేశిస్తుంటే.. దానికి సభ లోపల నుంచి సమర్థవంతమైన రీ-కౌంటర్ ఇవ్వలేక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బయట పడిపోవడం రేవంత్ రెడ్డి నైతిక విజయాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రత్యర్థి వ్యూహాన్ని ముందుగా అంచనా వేసి కౌంటర్ అజెండాను సిద్ధం చేసుకోవడంలో బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం విఫలమవుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రధానంగా, రేవంత్ రెడ్డి ఆడుతున్న డైవర్షన్ అండ్ అటాక్ గేమ్‌ను తిప్పికొట్టడంలో కేటీఆర్, హరీష్ రావుల ప్రతిదాడి తాత్కాలిక మీడియా సమావేశాలకే పరిమితమవుతోంది. శాసనసభ వేదికపైకి రాకుండా కేవలం తెలంగాణ భవన్‌కు పరిమితమై ఇచ్చే స్పష్టతలకు, అధికారికంగా ప్రభుత్వ రికార్డుల ప్రాతిపదికన సీఎం చేసే ప్రకటనలకు మధ్య ఉన్న రాజకీయ ప్రాధాన్యతలో చాలా తేడా ఉంది. ప్రభుత్వం తమనే లక్ష్యంగా చేసుకుని విచారణల వల పన్నుతున్నప్పుడు, దానికి సమాంతరంగా ప్రజల్లోకి వెళ్లే క్రమశిక్షణతో కూడిన వ్యూహం లోపించడం వల్ల బీఆర్ఎస్ క్షేత్రస్థాయి శ్రేణులు కూడా కొంత ఆత్మరక్షణలో పడుతున్నాయి.ఇలాంటి సంక్లిష్టమైన పరిస్థితుల్లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు స్వయంగా ఫీల్డ్‌లోకి రాక తప్పని పరిస్థితి ఏర్పడింది.



కేవలం కేటీఆర్, హరీష్ రావుల పోరాటంతో రేవంత్ రెడ్డి విసురుతున్న రాజకీయ, ఆర్థిక, చట్టపరమైన బాణాలను పూర్తిగా తిప్పికొట్టడం కష్టమనే సంకేతాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ స్వయంగా ప్రజల్లోకి వచ్చి , మీడియా వేదికగా రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను సమర్థవంతంగా, తనదైన మార్క్ శైలిలో తిప్పికొడితే తప్ప గులాబీ శ్రేణుల్లో మళ్లీ పాత ఉత్సాహం నింపడం సాధ్యపడదు. ఈ వ్యూహాత్మక పోరాటంలో బీఆర్ఎస్ తన విధానాన్ని తక్షణమే మార్చుకోవాల్సి ఉంది. అధికార పక్షం విసిరే వివాదాల ఉచ్చులో చిక్కుకుని అసెంబ్లీ బహిష్కరణలు, సస్పెన్షన్లకు గురికాకుండా.. రేవంత్ సర్కార్ లేవనెత్తుతున్న ప్రతి అంశానికి పక్కా రికార్డులతో సభలోనే ఎదురుదాడి చేయాల్సి ఉంది. 30 రోజుల ఎర్రవల్లి భూముల విచారణ ముగిసేలోగా బీఆర్ఎస్ గనుక రాజకీయంగా పుంజుకోకపోతే, కాంగ్రెస్ పార్టీ ఈ భూముల వివాదాన్ని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వరకు ప్రధాన ప్రచారాస్త్రంగా వాడుకునే ప్రమాదం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి వర్సెస్ కేసీఆర్ ప్రత్యక్ష సమరానికి సమయం ఆసన్నమైంది. రేవంత్ వేస్తున్న వ్యూహాత్మక పాచికలను తిప్పికొట్టే రాజకీయ చతురత, తెలంగాణ సెంటిమెంట్ అస్త్రం కేసీఆర్ దగ్గరే ఉన్నాయి. మరి గులాబీ అధినేత ఎప్పుడు ఫామ్‌హౌస్ దాటి ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఈ పొలిటికల్ నెరేటివ్‌ను తనవైపు తిప్పుకుంటారో వేచి చూడాల్సిందే.

22ఏ భూముల వివాదాలకు పరిష్కారం.. 30 రోజుల్లో న్యాయం జరిగేలా చర్యలు

హైదరాబాద్, : తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదల ఆస్తుల వివాదాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. సీసీఎల్ఏ, న్యాయశాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. యూఎల్‌సీ భూములు, ఆమోదిత లేఅవుట్లలో ప్రభుత్వ భూములు, సింగరేణి కోల్‌బెల్ట్, జీవో 59, జీవో 118, అసైన్డ్ భూములు, ఇందిరమ్మ ఇళ్లు, నాలా రుసుములు, అనధికార లేఅవుట్లు, లీజ్‌హోల్డ్ ఆస్తులు, భూదాన్ భూములు తదితర 12 అంశాలపై ప్రభుత్వం పరిష్కార చర్యలు ప్రకటించింది.తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో చేరిన నిరుపేదల ఆస్తుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ అంశంపై బుధవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. 22ఏ నిషేధిత జాబితా వివాదాల పరిష్కారానికి సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారితో హైపవర్ ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేదలకు సంబంధించిన న్యాయబద్ధమైన కేసుల్లో అన్యాయం జరగకుండా నిర్దిష్ట గడువుల్లో పరిష్కారం చూపుతామని తెలిపారు.భూములకు సంబంధించిన చట్టాలు, నిబంధనలు నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు ఎలా మారాయన్న అంశాలను సీఎం రేవంత్ సభలో వివరించారు. ఈ చారిత్రక పరిణామాల నేపథ్యంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న వివిధ రకాల భూములు, ఆస్తుల సమస్యలను ప్రభుత్వం విడివిడిగా పరిశీలించనుంది. ప్రధాన అంశాలపై చర్యలు తీసుకునే ప్రతిపాదనలను వెల్లడించిందిఅర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) మిగులు భూముల విషయంలో పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు వర్తించేలా కొత్త విధానం తీసుకురానుంది. పాత పెండింగ్ దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులనూ ఈ విధానంలో పరిగణనలోకి తీసుకోనుంది.

రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది..!

హైదరాబాద్, : రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఈ పది మంది ఎమ్మెల్యేలలో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు.ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక విచారణల ముందుకు వచ్చినప్పుడు.. మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వినతిపత్రాలతో కలిశాం అని న్యాయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది.కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు ఒకవైపు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యతా లభించడం లేదు. ఇటు బిఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాష్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకూ సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది.సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్తే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీ నుంచి సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

డార్క్ ప్యాటర్న్స్‌పై సీసీపీఏ కొరడా...!



ఆన్‌లైన్ షాపింగ్‌లో వినియోగదారులను తప్పుదోవ పట్టించే 'డార్క్ ప్యాటర్న్స్'పై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీ (సీసీపీఏ) కఠిన చర్యలు ప్రారంభించింది. ఇండిగో, జెప్టో, ఫస్ట్‌క్రై, ఫిజిక్స్ వాలా, బుక్‌మైషో, స్పైస్‌జెట్, ఫార్మాఈజీ, మెకాఫీ, అనుజ్ జిందాల్ అకాడమీ సహా తొమ్మిది డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తం సుమారు రూ.20 లక్షల జరిమానాలు విధించింది. వినియోగదారుల స్పష్టమైన అనుమతి లేకుండా కార్ట్‌లో మెంబర్‌షిప్‌లు లేదా విరాళాలు చేర్చడం, ఆఖరి స్టేజ్‌లో అదనపు ఛార్జీలు చూపించడం, భావోద్వేగపూరిత సందేశాలతో కొనుగోలుదారులను ఒప్పించడం, కౌంట్‌డౌన్ టైమర్లతో తప్పుడు అత్యవసర పరిస్థితి సృష్టించడం వంటి పద్ధతులను సీసీపీఏ 'డార్క్ ప్యాటర్న్స్'గా గుర్తించింది. 2023లో తీసుకొచ్చిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన సంస్థలపై చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో వెల్లడించింది. ఈ-కామర్స్ సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను స్వయంగా ఆడిట్ చేసి ఇలాంటి పద్ధతులను తొలగించాలని కూడా సీసీపీఏ ఆదేశించింది. ఈ చర్యల్లో జెప్టోకు రూ.7 లక్షలు, ఫిజిక్స్ వాలాకు రూ.5 లక్షలు, అనుజ్ జిందాల్‌కు రూ.3 లక్షలు, ఫస్ట్‌క్రైకు రూ.2 లక్షలు, ఫార్మాఈజీ, మెకాఫీ, స్పైస్‌జెట్‌లకు చెరో రూ.1 లక్ష జరిమానా విధించారు. ఇండిగో తన యాప్‌లో 'లేదు... నేను రిస్క్ తీసుకుంటాను' వంటి వినియోగదారుడిపై ఒత్తిడి తెచ్చే సందేశాన్ని తొలగించి, సరైన ఆప్షన్ కనిపించేలా మార్చింది. బుక్‌మైషో కూడా ముందే సెలక్ట్ చేసిన డొనేట్ ఆప్షన్‌ను తొలగించింది. డేటమ్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం, డార్క్ ప్యాటర్న్స్ కారణంగా దేశీయ ఆన్‌లైన్ యూజర్లు ఏటా రూ.25,000?28,000 కోట్ల వరకు అదనపు ఖర్చు భరిస్తున్నారు. దేశంలోని 30.4 కోట్ల ఆన్‌లైన్ కొనుగోలుదారుల్లో 88 శాతం మంది ఈ పద్ధతుల ప్రభావానికి గురవుతున్నారని, కనిపించని ఛార్జీలు, డ్రిప్ ప్రైసింగ్, బలవంతపు సబ్‌స్క్రిప్షన్లు డిజిటల్ మార్కెట్‌పై వినియోగదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయని నివేదిక హెచ్చరించింది.

యోగి బాటలో సువేందు



కోల్ కత్తా, : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ధోరణులను సవాలు చేస్తూ సువేందు అధికారి తన పాలనను ఆరంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు అనుసరించిన కఠినమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారని విశ్లేషకులు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే పాత సమస్యలపై దృష్టి సారించడం ఈ విధానం ప్రధాన లక్షణం.యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మాఫియా నెట్‌వర్క్‌లను అణచివేయడం, మహిళలపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు, అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు, అల్లర్ల సమయంలో రాష్ట్రాన్ని శాంతియుతంగా ఉంచడం వంటి అంశాలు గుర్తుంచుకోదగినవి. సువేందు అధికారి కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించారు. ఏడు దశాబ్దాలుగా పరిష్కారం కాని అంశాలను త్వరగా అందుకోవడం ఆయన పాలనలో కనిపిస్తోంది. కోల్‌కతా విమానాశ్రయం సమీపంలోని నిర్మాణం విమానాల కదలికకు అడ్డంకిగా మారిన సందర్భంలో కఠిన నిర్ణయం తీసుకోవడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి చర్యలు రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేస్తాయని మద్దతుదారులు వాదిస్తున్నారు.ప్రజా ప్రదేశాల్లో మసీదులు, ఆలయాలు, చర్చిల నుంచి వచ్చే అధిక శబ్దం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి సమస్యపై యోగి ప్రభుత్వం తీసుకున్న చర్యలను అనుసరిస్తూ, అవసరమైన చోట్ల మైకుల తొలగింపు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మదరసాలు, మసీదుల వద్ద ఏర్పడే గందరగోళాన్ని తగ్గించే ప్రయత్నం కూడా కొనసాగుతోంది. మంత్రి అగ్నిమిత్ర పాల్ త్వరలో ఫలితాలు కనిపిస్తాయని సూచించారు. ఇది మతాల మధ్య సమాన నియమాలను అమలు చేసే ప్రయత్నంగా చూడవచ్చు.ఈ చర్యలపై ముస్లిం అనుకూల పార్టీలు, కొన్ని మసీదు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సెక్యూలర్ ఫ్రంట్ ఎమ్మెల్యే నౌసాద్ సిద్దీఖి కుటుంబం నిర్వహించే దర్గా సంబంధిత వ్యక్తులు, కోల్‌కతాలోని నకుడా మసీదు ప్రతినిధులు మైకుల తొలగింపును వ్యతిరేకించారు. సీఎంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం తన విధానంపై స్థిరంగా ఉండటం గమనార్హం. ఇలాంటి వ్యతిరేకత రాజకీయ ధ్రువీకరణకు దారితీసే అవకాశం ఉంది. అయితే చట్టం ముందు అందరూ సమానమనే సూత్రాన్ని నొక్కి చెప్పడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.సువేందు అధికారి పాలన ఇప్పటికే యోగి, హిమంత మాదిరిగా చట్టం, శాంతి, అభివృద్ధి నినాదంపై దృష్టి సారించింది. కొన్ని నెలల్లోనే పాత సమస్యలపై చర్యలు తీసుకోవడం ప్రజల్లో ఆశను కలిగించవచ్చు. అయితే దీర్ఘకాలిక విజయం చట్ట అమలు సమానత్వం, పక్షపాత రహిత విధానం, సామాజిక సామరస్యం కాపాడటంపై ఆధారపడి ఉంటుంది. వ్యతిరేక పార్టీలు, మత సంస్థల నుంచి వచ్చే ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించగలిగితే బెంగాల్ రాజకీయాల్లో కొత్త ధోరణి నెలకొనే అవకాశం ఉంది.

సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

న్యూఢిల్లీ, : కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎందచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితె..కొందరు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది.ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి.ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పే హెల్త్ క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. గతంలో కూడా ఫుడ్ ప్రొడక్టులపై తప్పుడు లేదా అతిశయోక్తి ఆరోగ్య క్లెయిమ్స్ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఒక ఉత్పత్తిలో ప్రొటీన్, విటమిన్లు లేదా మరేదైనా పోషక పదార్థం ఉన్నంత మాత్రాన దాన్ని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరైనది కాదు. ఇదొక్కటే 'ఆరోగ్యకరమైనది'గా చూపకుండా, సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, శారీరక శ్రమ వంటి అంశాలతో కలిపి ఆహారాన్ని చూడాల్సి ఉంటుంది.సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు లక్షలాది మంది ఫాలోవర్లు ఉంటారు. వారు ఒక ఫుడ్‌ను ఇమ్యూనిటీ పెంచుతుంది.. ప్రొటీన్ లోపాన్ని తీరుస్తుంది లేదా ఆరోగ్యానికి ఎంతో మంచిది అని చెబితే, చాలామంది వినియోగదారులు దాన్ని నిపుణుల సలహాగా భావించే అవకాశం ఉంటుంది. అందుకే ఫాలోవర్లను ప్రభావితం చేసే వ్యక్తులు ఉత్పత్తి గురించి చెప్పే ప్రతి ఆరోగ్య క్లెయిమ్ విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

హైదరాబాద్ : తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమెటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు. భారీ, మధ్యతరహా వాహనాలతో పాటు లైట్ మోటార్ వెహికల్స్ కూడా ఏటీఎస్ పరిధిలోకి రానున్నాయి. ట్రక్కులు, బస్సులు వంటి హెవీ, మీడియం వాహనాలతో పాటు కార్లు, జీపులు తదితర తేలికపాటి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో వాహన రకం ఆధారంగా అవసరమైన సాంకేతిక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. ఈ విధానంలో కొన్నిసార్లు వాహనాన్ని పూర్తిస్థాయిలో సాంకేతికంగా పరిశీలించకుండానే పైపైనే చూసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనం నిజంగా రోడ్డు ప్రయాణానికి సురక్షితమైనదేనా అన్న అంశంపై మరింత కచ్చితమైన అంచనా అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యం లో ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమేటిక్ చేయం ద్వారా పారదర్శకతను పెంచాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీఎస్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేరుగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లో అప్‌లోడ్ అవుతాయి. దీంతో పరీక్షల రికార్డులు డిజిటల్‌గా నమోదవుతాయి. వాహనం ఫిట్‌నెస్‌కు సంబంధించిన సమాచారాన్ని భవిష్యత్‌లో సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.

తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

హైదరాబాద్ : హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్కుగా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్-బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్-జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది.దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ.699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు.

80 శాతం తగ్గిన గులాబీ విరాళాలు!



హైదరాబాద్, : తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఆ పార్టీ ఫండ్స్ ఏకంగా 82 శాతం పడిపోయాయి. గతంలో రూ. 85 కోట్లు పొందిన బీఆర్ఎస్‌కు రూ.15 కోట్లకు పడిపోయింది. మరోవైపు.. ఎంఐఎం పార్టీ కూడా విరాళాలను సున్నాగా ప్రకటించింది. అంతేకాకుండా.. ఈ 2 పార్టీలు తమ విరాళాల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు గడువు దాటిన తర్వాతే సమర్పించాయని నివేదిక స్పష్టం చేసింది.తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 10 ఏళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి అధికారాన్ని కోల్పోయిన తర్వాత తీవ్ర ఆర్థిక ఎదురుదెబ్బ తగిలింది. విరాళాల సమీకరణలో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పొలిటికల్ ఫండింగ్ డిస్‌క్లోజర్స్‌పై 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న బీఆర్ఎస్ విరాళాలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 82 శాతం క్షీణించాయి.2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 మంది దాతల ద్వారా రూ. 85 కోట్ల విరాళాలు పొందిన బీఆర్ఎస్ పార్టీ.. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 4 దాతల ద్వారా రూ. 15 కోట్లు మాత్రమే రాబట్టగలిగింది. దేశవ్యాప్తంగా విశ్లేషించిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోనూ అత్యధికంగా నికర రూపంలో రూ. 70 కోట్ల మేర విరాళాలు కోల్పోయిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచింది. గతంలో రద్దైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 495 కోట్లు రాబట్టి తెలుగు రాష్ట్రాల పార్టీల్లోనే అత్యధిక నిధులు పొందిన పార్టీగా రికార్డు సృష్టించిన బీఆర్ఎస్‌కు.. అధికారం పోయిన తర్వాత విరాళాల ప్రవాహం మందగించడం గమనార్హం.తెలంగాణకు చెందిన మరొక ప్రముఖ ప్రాంతీయ పార్టీ ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎంఐఎం పార్టీ 2024-25 సంవత్సరానికి గాను రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న విరాళాలను సున్నాగా ప్రకటించింది. కాగా.. 2023-24లో ఈ పార్టీ 16 విరాళాల ద్వారా రూ. 9 లక్షలు వచ్చినట్లు వెల్లడించింది. నేషనల్ లెవల్‌లో గత ఏడాది నిధులు ప్రకటించి.. ఈ ఏడాది రూ.20 వేలకు పైబడిన విరాళాలు సున్నాగా చూపిన 3 పార్టీల్లో ఎంఐఎం ఒకటిగా నిలిచింది.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువును పాటించడంలోనూ తెలంగాణ పార్టీలు విఫలం అయ్యాయి. 2023-24లో సరైన సమయానికే విరాళాల వివరాలను ఈసీకి సమర్పించిన బీఆర్ఎస్, ఎంఐఎం.. 2024-25కి సంబంధించి మాత్రం గడువు దాటిన తర్వాతే నివేదికలు ఇచ్చాయి. బీఆర్ఎస్ నిర్ణీత గడువు కంటే 9 రోజులు ఆలస్యంగా రిపోర్ట్ చేయగా.. ఎంఐఎం 28 రోజుల ఆలస్యంగా తన నివేదికను సమర్పించినట్లు ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది.

రేవంత లెక్కలోకి బనకచర్ల ప్రాజెక్ట్ రిజెక్ట్..



హైదరాబాద్, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పోలవరం?బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల అప్రైజల్ కమిటీ వెనక్కి పంపడంతో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. ఈ పరిణామాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తమ నేత రేవంత్ రెడ్డి సాధించిన దౌత్యపరమైన విజయంగా ప్రచారం చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ప్రాథమిక దశలోనే విఫలమైందంటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. అయితే, ఈ రాజకీయ క్రెడిట్ వార్, ప్రతివిమర్శలకు ఆవల సాంకేతిక, చట్టపరమైన కోణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే, ఇది ఒకరికి లభించిన విజయమో లేదా మరొకరికి ఎదురైన ఓటమో కాదని.. నదీ జలాల చట్టాలకు అనుగుణంగా జరిగిన ఒక సహజ సిద్ధమైన పరిణామమని స్పష్టమవుతోంది.పర్యావరణ అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే, ఏ భారీ నదీ అనుసంధాన ప్రాజెక్టుకైనా ఒక స్పష్టమైన చట్టబద్ధమైన కార్యాచరణ ఉంటుంది. కేంద్ర జల సంఘం ద్వారా శాస్త్రీయంగా నీటి లభ్యత ధృవీకరణ పొందకుండానే పర్యావరణ అనుమతుల కోసం వెళ్లడం సాంకేతికంగా సరికాదు. చట్టబద్ధమైన ప్రాథమిక అనుమతులు లేకుండా ముందుకెళితే, భవిష్యత్తులో గ్రీన్ ట్రిబ్యునల్ లేదా సుప్రీంకోర్టు పరిధిలో పిటిషన్లు దాఖలై ప్రాజెక్టుపై శాశ్వత స్టే వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి కేంద్రం ఈ ప్రతిపాదనలను తిరస్కరించి వెనక్కి పంపడం అనేది ప్రాజెక్టుకు ముమ్ముందు చట్టపరమైన చిక్కులు ఎదురుకాకుండా నిరోధించే ఒక ముందస్తు చర్యగా పరిగణించవచ్చు.గోదా వరి జల వివాదాల ట్రిబ్యునల్ నిబంధనలు , అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం ఎగువ , దిగువన ఉన్న ప్రతి ఒక్క రాష్ట్ర ప్రయోజనాలను రక్షించాల్సిన రాజ్యాంగ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఏపీ రూపొందించిన ప్రస్తుత ప్రాజెక్టు డిజైన్ ద్వారా తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కూడా ముంపు ముప్పు, నీటి కేటాయింపులపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. గోదావరి బేసిన్ నుంచి సముద్రంలోకి వెళ్లే మిగులు, వరద నీటి పరిమాణాన్ని శాస్త్రీయంగా లెక్కించి, వాటాలపై స్పష్టత ఇచ్చే వరకు సీడబ్ల్యూసీ లేదా ఈఏసీ అనుమతులు మంజూరు చేయడం అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టాలకు విరుద్ధమవుతుంది.

ప్లాన్ బీలో రేవంత్...కర్ణాటక ఎఫెక్ట్...!

హైదరాబాద్, : పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్త్‌లు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకూ వీడ్కోలు పలికే వరకు పరిస్థితి దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి ఉ వని జి ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకోకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్త్‌ల కోసం తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి,ఎస్సీ, ఎస్టీ,మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస్?తంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత + కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్త్‌లు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి, వారికి పవర్ ఫుల్ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, లేదా ప్రభుత్వ సలహాదారు పాత్రలను ఆఫర్ చేయడం ద్వారా ముందస్తుగానే అసంతృప్తికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కేబినెట్ విస్తరణకు ముందే పూర్తయితే, ప్రమాణ స్వీకారం రోజున డ్రామాలు జరగకుండా నివారించవచ్చనేది కాంగ్రెస్ ప్లాన్.

ఒంటరిగా బరిలోకి జనసేన



హైదరాబాద్, : తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. : తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. దీంతో సొంతంగానే పోటీకి సిద్ధమవుతోంది జనసేన తెలంగాణలో. త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికలతో పాటు ప్రభావం చూపించగలిగిన జిల్లాల్లో ప్రాదేశిక ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని చూస్తోంది జనసేన. అయితే ఉన్నట్టుండి బిజెపి జనసేన విషయంలో ఆ ఆలోచన చేయడానికి కారణం ఏంటనే ప్రశ్న వినిపిస్తోంది. భారత రాష్ట్ర సమితి తో బిజెపి పొత్తు ఉంటుందన్న పరిణామ క్రమంలోనే జనసేన ను దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అయితే జనసేన మాత్రం ఒంటరి పోరాటానికి అన్ని ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు సమాచారం.వాస్తవానికి ఏపీ మాదిరిగా తెలంగాణలో రాజకీయాలు ఉండవు. బిజెపి ఆది నుంచి స్వంతంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. కానీ ఆశించిన స్థాయిలో ఆ ప్రయత్నాలు ఏవి ఫలించడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావం చూపింది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ స్థానాలను తెచ్చుకుంది. అయితే బిజెపి అంతలా ప్రభావం చూపడానికి కారణం భారత రాష్ట్ర సమితి బలహీనం కావడమే. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడలేదు. ఆ బలాన్ని భర్తీ చేయాలంటే భారత రాష్ట్ర సమితితో పొత్తు బిజెపికి అవసరం. అదే సమయంలో పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలంటే ఓట్లతో పాటు సీట్లు పెంచుకోవడం భారత రాష్ట్ర సమితికి అవసరం. అందుకే ఆ రెండు పార్టీలు ఇప్పుడు పరస్పరం ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. జనసేన ను బిజెపి దూరం పెట్టడానికి అదే ప్రధాన కారణం అని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో మొన్న ఆ మధ్యన జరిగిన పరిణామాలు తెలియనివి కావు. పవన్ కళ్యాణ్ ను తెలంగాణ నుంచి కొంతమంది వ్యతిరేకించడం ప్రారంభించారు. దీంతో తెలంగాణలో కార్యకలాపాలు మొదలు పెట్టింది జనసేన. హైదరాబాదులో రాష్ట్ర కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అయితే బిజెపితో పొత్తు ఉంటుందన్న తరుణంలోనే ఇలా చేస్తున్నారని అంతా భావించారు. కానీ భారతీయ జనతా పార్టీ ఆలోచన మరోలా ఉంది. అందుకే జనసేనతో పొత్తు విషయంలో క్లారిటీ ఇచ్చింది. కానీ ఏపీ అనుభవాల నేపథ్యంలో ఒంటరిగా ముందు పోటీ చేసి.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఇతర పార్టీలు పొత్తుకు ముందుకు వస్తాయని.. అందుకే ఒంటరిగా ముందుకు వెళ్దామని జనసేన వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. సెటిలర్స్ అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు అభిమానులు ఉన్నచోట పార్టీని మరింత బలోపేతం చేయాలని జనసేన భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది.

వివాదాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే..?



అదిలాబాద్, : కొన్ని పత్రికల్లో ప్రచురితమైన అవినీతి , అక్రమాల కథనాలను మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తీవ్రంగా ఖండించారు. తన వ్యక్తిత్వ హననానికి, రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొందరు రాజకీయ ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఈ తప్పుడు ప్రచారాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో గానీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గానీ తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని.. ఇసుక, భూముల వ్యాపారాలకు ఎప్పుడూ దూరంగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తనపై అసత్య కథనాలు రాస్తున్న వ్యక్తులు, సంబంధిత పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.ప్రధానంగా ప్రచారంలో ఉన్న రూ. 450 కోట్ల బ్యాంక్ రుణాల వ్యవహారంపై ఎమ్మెల్యే పక్కా ఆధారాలతో క్లారిటీ ఇచ్చారు. 2009-10 కాలంలో సాయినాథ్ ప్రైవేట్ లిమిటెడ్, భాగ్యనగర్ హోటల్స్ పేర్లపై బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని, అవి తాను సొంతంగా సృష్టించిన పత్రాలు కావని తెలిపారు. 2014 నుంచి 2025 వరకు కంపెనీ ద్వారా వినియోగించిన మొత్తం నిధులు రూ. 109 కోట్ల 11 లక్షలు మాత్రమేనని, అన్ని బ్యాంకులు కూడా అదే మొత్తాన్ని ఎన్‌పీఏ గా గుర్తించాయని వివరించారు. ఒకవేళ రూ. 450 కోట్ల మేర మోసమే జరిగి ఉంటే బ్యాంకులు కేవలం రూ. 109 కోట్లకు ఆస్తులను ఎలా వేలం వేస్తాయని ఆయన ప్రశ్నించారు.రుణ చెల్లింపులకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ, 2014 నుంచి 2025 మధ్య కాలంలో బ్యాంకులకు ఇప్పటికే రూ. 44 కోట్ల 81 లక్షలు చెల్లించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆంధ్ర బ్యాంక్ ఖాతా ఎన్‌పీఏగా మారిన తర్వాత కూడా మరో రూ. 18 కోట్ల 72 లక్షలు చెల్లించామని, 2024 అక్టోబర్ 31 నుంచి నిరంతరంగా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. వ్యాపారంలో ఎదురైన ఒడుదొడుకులను ప్రస్తావిస్తూ.. యూఎస్ ట్రేడింగ్ మార్కెట్ తీవ్ర పతనం కావడం వల్ల తాను వ్యక్తిగతంగా రూ. 160 కోట్ల మేర భారీ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని, అయినప్పటికీ బాధ్యతాయుతంగా బ్యాంకు బకాయిలను తీరుస్తున్నట్లు చెప్పారు.తన సామాజిక, ప్రజా సేవలను గుర్తుచేస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా సొంత నిధులతో 15 పాఠశాలలను నిర్మించి విద్యారంగానికి సహాయపడ్డానని ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తున్న నాయకులు ధైర్యముంటే ఎక్కడైనా బహిరంగ చర్చకు రావాలని, తాను పూర్తి ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. అవసరమైతే ఈ వ్యవహారంపై నిజానిర్ధారణ కమిటీ వేసినా, కమిటీ ముందుకు వచ్చి అన్ని పత్రాలు, సాక్ష్యాధారాలు సమర్పించేందుకు తాను వెనుకాడేది లేదని ప్రకటించారు. రాష్ట్ర కేబినెట్ విస్తరణలో తన పేరు మంత్రి పదవి రేసులోకి వచ్చిన ప్రతిసారీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొందరు స్వపక్ష, విపక్ష నేతలు కావాలనే ఇటువంటి కుట్రలకు తెరలేపుతున్నారని ఎమ్మెల్యే తీవ్ర ఆరోపణలు చేశారు. గత పదేళ్లపాటు తీవ్ర ప్రతికూల పరిస్థితులలో, ప్రతిపక్షంలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పోరాడిన తనపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం తీవ్ర బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ రాజకీయ కుట్రల వెనుక ఉన్న అసలు సూత్రధారుల జాతకాలు బయటపడతాయని, నిజా నిజాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ప్రకటించారు.

కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...



న్యూఢిల్లీ, : కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది.సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్టన్ల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది.అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి.ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న.సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

భారత్, ఫ్రాన్స్ రఫెల్ డీల్



న్యూఢిల్లీ: భారత ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాల కొరతను తీర్చడానికి ఫ్రాన్స్ సమర్పించిన రూ.3.25 లక్షల కోట్ల రఫేల్ ప్రతిపాదన కేవలం కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు. ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ దిశగా ముఖ్యమైన అడుగు. 114 జెట్లలో 94 దేశంలోనే తయారు చేస్తామని ఫ్రాన్స్ తెలిపింది. దీంతో టెక్నాలజీ బదిలీ, స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలకు భారీ అవకాశాలు కలుగుతాయి.ఫ్రాన్స్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 114 రఫేల్ జెట్లలో 94 భారత్‌లోనే ఉత్పత్తి అవుతాయి. కొన్ని విమానాలు ఫ్లై?అవే కండిషన్‌లో వస్తాయి, మిగతావి దేశీయ భాగస్వామ్యంతో తయారవుతాయి. ఇది గత రఫేల్ ఒప్పందాలకు భిన్నంగా, మొట్టమొదటిసారి రఫేల్‌ను ఫ్రాన్స్ వెలుపల పెద్ద ఎత్తున తయారు చేయబోతోంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్లు, అవయోనిక్స్‌లో స్థానిక కంటెంట్ 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ స్వయంప్రతిపత్తి పెరుగుతుంది, భవిష్యత్తులో సొంత యుద్ధ విమానాల అభివృద్ధికి అనుభవం లభిస్తుంది.ఈ ఒప్పందం ఆమోదమైతే భారతీయ కంపెనీలకు దాదాపు రూ.1.6 లక్షల కోట్ల వ్యాపారం వస్తుందని అంచనా. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, లార్సెన్ ? టూబ్రో వంటి సంస్థలు ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ అసెంబ్లీ, అవయోనిక్స్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌లో పాల్గొంటాయి. ఫ్రెంచ్ కంపెనీలు డసాల్ట్, సఫ్రాన్, థేల్స్, ఎంబీడీఏ భారత భాగస్వాములతో కలిసి పనిచేస్తాయి. ఇది ఏరోస్పేస్ సప్లై చైన్‌ను బలోపేతం చేసి, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్థానిక ఆయుధాలు ఇంటిగ్రేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.రఫేల్ విడిభాగాల తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటవుతుంది. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో ఫ్యూజ్‌లేజ్(ఫ్యూస్‌లేజ్) తయారీ ఒప్పందాలు ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను ఏరోస్పేస్ హబ్‌గా మరింత బలపరుస్తుంది. ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌వో) సౌకర్యాలు కూడా ఇక్కడే రావచ్చు. దీనివల్ల తెలంగాణలో ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయి.భారత వాయుసేన స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఈ జెట్లు ముఖ్యం. ప్రస్తుతం ఉన్న 36 రఫేల్‌లకు జోడించి మొత్తం సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 4.5 జనరేషన్ మల్టీ?రోల్ సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు శత్రు దేశాలపై నిరోధక శక్తిని పెంచుతాయి. టెక్నాలజీ బదిలీతో భవిష్యత్తు స్వదేశీ విమానాల అభివృద్ధికి కూడా సహాయపడుతుంది.ప్రతిపాదనను రక్షణ శాఖ, వాయుసేన పరిశీలిస్తున్నాయి. ధర, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ స్థాయి, ఇండిజినస్ కంటెంట్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌పై చర్చలు జరుగుతాయి. ఒప్పందం ఆమోదమైతేనే పూర్తి ప్రయోజనాలు వస్తాయి. ఈ ప్రతిపాదన భారత్ రక్షణ సామర్థ్యం పెంచడంతోపాటు ఆర్థిక, పారిశ్రామిక లబ్ధిని కలిగిస్తుంది. భారత?ఫ్రాన్స్ రక్షణ సహకారంలో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

షుగర్ పేషెంట్లు జామపండు తినొచ్చా...?



పండ్లు ఆరోగ్యానికి మంచివే అయినా.. షుగర్, బీపీ వంటి సమస్యలు ఉన్నవారు ఏ పండు పడితే అది తినకుండా కొన్ని విషయాలను తప్పక గమనించాలి. ముఖ్యంగా తీపి ఎక్కువగా ఉండే పండ్ల విషయంలో చాలామందికి సందేహాలు ఉంటాయి. అయితే జామపండు మాత్రం ఫైబర్, విటమిన్ అ వంటి పోషకాలు సమృద్ధిగా ఉండే పండుగా గుర్తింపు పొందింది. జామపండులో ఫైబర్ ఉండటం వల్ల రక్తంలో గ్లూకోజ్ వేగంగా పెరగకుండా ఉండేందుకు సహాయపడే ఆహార ఎంపికగా పరిగణించవచ్చు. ముఖ్యంగా జ్యూస్ రూపంలో కాకుండా మొత్తం పండుగా తినడం వల్ల ఫైబర్ కూడా లభిస్తుంది. అయితే డయాబెటిస్ ఉన్నవారు ఎంత మోతాదులో తినాలి అనేది వారి మొత్తం ఆహారం, మందులు, రక్తంలో చక్కెర స్థాయిలపై ఆధారపడి ఉంటుంది. జామపండులో విటమిన్ అ గణనీయంగా ఉంటుంది. ఈ విటమిన్ శరీరంలో సాధారణ రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు అవసరం. యాంటీఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. అందువల్ల ఆహారంలో జామపండును చేర్చుకోవడం ద్వారా విటమిన్ అ అవసరాల్లో కొంత భాగాన్ని పొందవచ్చు. జామపండులో డైటరీ ఫైబర్ ఉంటుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి, మలబద్ధకం తగ్గడానికి సహాయపడుతుంది. సమతుల్య ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను చేర్చుకోవడం సాధారణంగా ఆరోగ్యకరమైన అలవాటుగా పరిగణిస్తారు. బీపీ ఉన్నవారు జామపండును ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. అయితే జామపండు బీపీని తగ్గించే మందు కాదు. బీపీ నియంత్రణకు ఉప్పు పరిమితం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, శారీరక చురుకుదనం, వైద్యులు సూచించిన మందులు వాడటం వంటి చర్యలు ముఖ్యమైనవి. జామపండు వంటి పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యకరమైన ఆహార విధానంలో ఒక భాగంగా ఉండొచ్చు. కానీ కేవలం జామపండు తినడం వల్ల అధిక రక్తపోటు తగ్గిపోతుందని భావించకూడదు. జామపండును శుభ్రంగా కడిగి, ముక్కలుగా కోసుకుని నేరుగా తినడం మంచి మార్గం. దానికి అదనంగా చక్కెర, ఉప్పు, మసాలాలు ఎక్కువగా కలపాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారు జామపండు జ్యూస్ కంటే పండుగానే తీసుకోవడం మంచిది. పండును నమిలి తినడం వల్ల దానిలోని ఫైబర్ కూడా ఆహారంలో భాగమవుతుంది. జామపండు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ అ వంటి పోషకాలను అందిస్తుంది. అయితే దీనిని ప్రత్యేకంగా 'డిటాక్స్ ఫుడ్'గా తీసుకుని శరీరంలోని అన్ని టాక్సిన్లను తొలగిస్తుందని చెప్పడం సరైంది కాదు.

చిన్నవయసులోనే కీళ్ల నొప్పులా....?



కీళ్ల నొప్పులు అంటే వృద్ధాప్యంలో వచ్చే సమస్యగానే చాలామంది భావిస్తారు. కానీ ప్రస్తుతం యువతలోనూ మోకాళ్లు, భుజాలు, మోచేతులు, మణికట్టు వంటి కీళ్లలో నొప్పి, బిగుతు, వాపు వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. స్పోర్ట్స్ ఆడేవారు, జిమ్‌లో అధికంగా వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు మాత్రమే కాకుండా.. రోజువారీ జీవితంలో ఒకే రకమైన కదలికలను పదేపదే చేసే వారిలోనూ ఈ సమస్య తలెత్తవచ్చు. కీళ్ల నొప్పులు అంటే వృద్ధాప్యంలో వచ్చే సమస్యగానే చాలామంది భావిస్తారు. కానీ ప్రస్తుతం యువతలోనూ మోకాళ్లు, భుజాలు, మోచేతులు, మణికట్టు వంటి కీళ్లలో నొప్పి, బిగుతు, వాపు వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. స్పోర్ట్స్ ఆడేవారు, జిమ్‌లో అధికంగా వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు మాత్రమే కాకుండా.. రోజువారీ జీవితంలో ఒకే రకమైన కదలికలను పదేపదే చేసే వారిలోనూ ఈ సమస్య తలెత్తవచ్చు.కీళ్ల నొప్పులకు ఒక్కటే కారణం ఉండదు. గాయం, బెణకడం, కండరాలపై అధిక ఒత్తిడి వంటివి కీలు చుట్టూ ఉన్న కణజాలాన్ని దెబ్బతీసి నొప్పి, వాపుకు కారణమవుతాయి. ముఖ్యంగా క్రీడల్లో పాల్గొనే యువతలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా కనిపించవచ్చు. మరో కారణం గౌట్. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగి దాని స్ఫటికాలు కీళ్లలో పేరుకుపోతే అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి, వాపు, ఎరుపు, వేడి వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధుల్లో రోగనిరోధక వ్యవస్థ పొరపాటున కీళ్లపై దాడి చేయడం వల్ల నొప్పి, వాపు ఏర్పడతాయి. వయసుతో ఎక్కువగా సంబంధం ఉన్న ఆస్టియో ఆర్థరైటిస్ కూడా కొన్ని సందర్భాల్లో చిన్న వయసులోనే కనిపించవచ్చు.

కీళ్ల మధ్య ఉండే మృదులాస్థి దెబ్బతినడం, అరిగిపోవడం వల్ల కదలికలో నొప్పి, బిగుతు ఏర్పడుతుంది. ఇవే కాకుండా టెండినైటిస్, లూపస్, ఫైబ్రోమయాల్జియా, థైరాయిడ్ సమస్యలు, కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా కీళ్ల నొప్పులకు కారణం కావచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కీళ్ల నొప్పితో పాటు వాపు, ఎరుపు, అధిక వేడి లేదా జ్వరం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. గాయం తర్వాత కీలు ఆకారం మారడం, అకస్మాత్తుగా తీవ్రమైన వాపు రావడం లేదా నొప్పి కారణంగా కీలును కదపలేకపోవడం వంటి పరిస్థితుల్లో అలస్యం చేయకుండా వైద్య సహాయం తీసుకోవాలి. తేలికపాటి నొప్పి కొన్నిసార్లు విశ్రాంతితో తగ్గిపోవచ్చు.

బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగారా?

ఉదయం నిద్రలేవగానే బ్లాక్ కాఫీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. అయితే ఇటీవల బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగడం కూడా సోషల్ మీడియాలో ట్రెండ్‌గా మారింది. ఈ డ్రింక్ తాగితే



త్వరగా బరువు తగ్గొచ్చని, శరీరంలోని కొవ్వు కరిగిపోతుందని, డిటాక్స్ అవుతుందని ప్రచారం జరుగుతోంది. బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి.. బరువు తగ్గించే అద్భుతమైన పానీయంగా భావించడం సరైంది కాదు. బ్లాక్ కాఫీలో ఉండే కెఫీన్ కొంతసేపు శక్తిని పెంచుతుంది. కొంతమందిలో ఆకలిని స్వల్పంగా తగ్గించే ప్రభావం కూడా ఉండొచ్చని యథార్థ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని డైటెటిక్స్ విభాగం అధిపతి సుహానీ సేథ్ అగర్వాల్ అంటున్నారు. అయితే ఈ ప్రభావంతోనే శరీరంలోని అదనపు కొవ్వు వేగంగా కరిగిపోతుందని చెప్పడానికి ఆధారాలు లేవట. బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలపడం వల్ల అదనంగా కొవ్వు కరుగుతుందని లేదా వేగంగా బరువు తగ్గుతారని నిరూపించే బలమైన శాస్త్రీయ ఆధారాలు ప్రస్తుతం లేవు. కాఫీలోని కెఫీన్ కొద్దిసేపు జీవక్రియను, శక్తి వినియోగాన్ని పెంచవచ్చు. కానీ ఈ ప్రభావం పరిమితంగానే ఉంటుంది.

కళ్లలో పసుపు రంగు కనిపిస్తోందా?

కొన్ని ఆరోగ్య సమస్యలు శరీరంలో మార్పులు మొదలైన వెంటనే మనకు తెలియజేస్తాయి. కానీ కొన్ని వ్యాధుల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా ప్యాంక్రియాస్‌కు సంబంధించిన క్యాన్సర్ ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే సాధారణ జీర్ణ సమస్యలుగా భావించి కొన్ని సంకేతాలను చాలామంది పట్టించుకోరు. ప్యాంక్రియాస్ లేదా క్లోమం పొట్ట లోపల, కడుపు వెనుక భాగంలో ఉండే ముఖ్యమైన అవయవం. జీర్ణక్రియకు అవసరమైన ఎంజైమ్‌లను తయారు చేయడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించే హార్మోన్ల ఉత్పత్తిలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ అవయవంలో క్యాన్సర్ ఏర్పడినప్పుడు ప్రారంభంలో పెద్దగా లక్షణాలు కనిపించకపోవచ్చు. కణితి పెరిగి చుట్టుపక్కల అవయవాలు లేదా పిత్తనాళాలపై ప్రభావం చూపినప్పుడు కొన్ని లక్షణాలు బయటపడే అవకాశం ఉంటుంది. చర్మం లేదా కళ్ల తెల్లని భాగం పసుపు రంగులోకి మారడం జాండిస్ (కామెర్లు) లక్షణం కావచ్చు. ప్యాంక్రియాస్‌లోని కణితి పిత్తనాళాన్ని అడ్డుకుంటే బిలిరుబిన్ శరీరంలో పేరుకుపోయి ఈ మార్పు రావచ్చు. మూత్రం ముదురు రంగులోకి మారడం, మలం లేత రంగులో కనిపించడం, చర్మంపై తీవ్రమైన దురద కూడా దీనితో పాటు ఉండొచ్చు. ఆహారంలో పెద్దగా మార్పులు చేయకపోయినా బరువు తగ్గడం గమనిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో పాటు అనేక ఇతర ఆరోగ్య సమస్యల్లోనూ అనుకోకుండా బరువు తగ్గడం కనిపించవచ్చు. అందువల్ల ఈ ఒక్క లక్షణం ఆధారంగా క్యాన్సర్ అని నిర్ధారించుకోకూడదు. కానీ నిరంతరంగా బరువు తగ్గుతుంటే వైద్య పరీక్ష అవసరం. పొత్తికడుపు పైభాగంలో నొప్పి లేదా మధ్య భాగం వెన్ను వరకు వ్యాపించే నొప్పి కూడా ఒక సంకేతంగా ఉండొచ్చు. అయితే ఇలాంటి నొప్పికి గ్యాస్,



జీర్ణ సమస్యలు, కండరాల సమస్యలు వంటి ఎన్నో కారణాలు ఉండవచ్చు. నొప్పి కొత్తగా మొదలై తగ్గకుండా కొనసాగుతున్నా, క్రమంగా ఎక్కువవుతున్నా వైద్యుడిని సంప్రదించడం మంచిది. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌లో ఆకలి తగ్గడం, వికారం, వాంతులు, పొట్ట ఉబ్బరం, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు కనిపించవచ్చు. కొందరిలో కొవ్వు ఎక్కువగా ఉన్నట్లుగా కనిపించే లేదా లేత రంగులో ఉండే మలం కూడా కనిపించవచ్చు. ప్యాంక్రియాస్ ఇన్సులిన్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల కొంతమందిలో ప్యాంక్రియాస్‌కు సంబంధించిన సమస్యలతో కొత్తగా డయాబెటిస్ బయటపడవచ్చు లేదా ఇప్పటికే ఉన్న షుగర్ నియంత్రణ కష్టంగా మారవచ్చు. ముఖ్యంగా ఇతర లక్షణాలతో పాటు అకస్మాత్తుగా రక్తంలో చక్కెర స్థాయిలు మారితే వైద్యుడితో చర్చించడం మంచిది. ఎటువంటి స్పష్టమైన కారణం లేకుండా శరీరమంతా తీవ్రమైన దురద రావడం కూడా కొన్నిసార్లు జాండిస్‌తో సంబంధం కలిగి ఉండవచ్చు.

రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు ప్రతి క్షణం ఎంతో భయంగా ఉండేది



టాలీవుడ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ తన గత ప్రేమ జీవితంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను ఓ ఇంటర్వ్యూలో పంచుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు తాను అనుభవించిన టాక్సిక్ రిలేషన్‌షిప్, ఎదుర్కొన్న మానసిక వేదన గురించి చెప్తూ ఎమోషనల్ అయ్యారు. ఆ బంధంలో ఉన్నంత కాలం ప్రతి క్షణం భయంతోనే బతికానని ఆమె తెలిపారు. ఆ రిలేషన్‌లో ఉన్నప్పుడు కనీసం తన సాధారణ పనులు కూడా ప్రశాంతంగా చేసుకోలేకపోయేదాన్ని అని చెప్పారు. ఏదైనా మాట్లాడే ముందు ఎదుటి వ్యక్తి ఎలా స్పందిస్తారో అని మనసులోనే వందసార్లు ప్రాక్టీస్ చేసుకోవాల్సి వచ్చేదని, ప్రతిరోజూ ఒక అనిశ్చితి భయం తనను వెంటాడేదని పేర్కొన్నారు. మనకు తెలియకుండానే చాలా నెమ్మదిగా, నిశ్శబ్దంగా ఆ భయాందోళన లోకి నెట్టబడతామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన మాజీ ప్రియుడి వల్ల తాను ఎన్నో మంచి సినిమా ప్రాజెక్ట్‌లను వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. తన ప్రతి విషయంలోనూ అతడు ప్రత్యక్షంగా, పరోక్షంగా జోక్యం చేసుకునేవాడని తెలిపారు. క్రమంగా తన కుటుంబానికి, స్నేహితులకు తనను పూర్తిగా దూరం చేశాడని అన్నారు. బయటకు వచ్చినప్పుడు ఎవరైనా చూసి ఎలా ఉన్నావు అని ప్రేమగా అడిగితే ఎక్కడ ఏడ్చేస్తానో అని భయపడేదాన్ని అని చెప్పారు. ఎదుటి వ్యక్తి తనకు ఎంత హాని చేస్తున్నా, తన ఎదుగుదలను ఎలా అడ్డుకుంటున్నా ఒకానొక దశలో తన సొంత కుటుంబం నుంచే అతడిని కాపాడుతూ వచ్చానని ఆమె గుర్తు చేసుకున్నారు. అతడి ప్రవర్తన వల్ల చివరకు తన ఆత్మీయులకు, స్నేహితులకు పూర్తిగా దూరమైపోయానని అనుపమ ఎమోషనల్ అయ్యారు. ఆ బంధంలో ఉన్నంత కాలం ప్రతి క్షణం భయంతోనే బతికానని ఆమె తెలిపారు.

'ఆంద్రో డ్రీమ్స్' ప్రత్యేక ప్రదర్శన...



చిత్ర దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ రూపొందించిన 'ఆంద్రో డ్రీమ్స్' డాక్యుమెంటరీ ప్రత్యేక ప్రదర్శనను హైదరాబాద్‌లో నిర్వహించారు. మహిళా ఫొటోగ్రాఫర్లు, విజువల్ స్టోరీటెల్లర్స్ కోసం ఏర్పాటైన హర్‌ఫోకస్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో, షెపర్డ్స్ స్టోరీస్ సాంస్కృతిక వేదిక సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. హర్‌ఫోకస్‌ను స్పందన కోటేశ్వరమ్మ, కీర్తి సంగు, హృదయ పణుగటి, ప్రేరికా ఎం కలిసి స్థాపించారు.మణిపూర్‌లోని ఆంద్రో గ్రామానికి చెందిన 66 ఏళ్ల లైబీ అనే మహిళ, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల ఫుట్‌బాల్‌కు అందించిన ప్రోత్సాహం, ఆమె ప్రయాణం చుట్టూ ఈ డాక్యుమెంటరీ కథ సాగుతుంది. సినిమా ద్వారా మహిళల సంకల్పం, దర్శకురాలు ఆవిష్కరించారు. ప్రదర్శన అనంతరం మీనా లాంగ్‌జామ్ ప్రేక్షకులతో ముచ్చటిస్తూ డాక్యుమెంటరీ రూపకల్పన, ఆంద్రో గ్రామం నేపథ్యం, చిత్రంలోని పాత్రల అనుభవాలు, సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. మహిళల కథలను, ప్రాంతీయ సంస్కృతులను, విభిన్న జీవిత అనుభవాలను డాక్యుమెంట్ చేసి వాటిని విస్తృత ప్రేక్షకులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో హర్‌ఫోకస్ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

ఆ సంఘటనతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా



ప్రముఖ హిందీ నటుడు గోవిందా గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ఇప్పటివరకు ఎన్నో చిత్రాల్లో అద్భుతమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన.. ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న గోవిందా.. తన జీవితంలో ఎదురైన విషాద సంఘటన గురించి, ఆ ఘటన తనపై ఎలాంటి ప్రభావం చూపిందో వివరించారు. గోవిందా మాట్లాడుతూ.. 1996లో తన తల్లి నిర్మలా దేవి మరణించారని, ఆమె మృతితో తాను తీవ్రంగా కృంగిపోయానని తెలిపారు. ఆమె లేని జీవితాన్ని ఎలా కొనసాగించాలో అర్థం కాక, జీవితంపై విరక్తి కలిగిందని చెప్పుకొచ్చారు. ఆ బాధను తట్టుకోలేక ఒకానొక దశలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా భావించినట్లు వెల్లడించారు. అమ్మ మరణాన్ని తట్టుకోలేక చనిపోవాలని నర్మదా నది దగ్గరకు వెళ్లాను. నదిలోకి వెళ్తుండగా ఓ సాధువు నన్ను అడ్డుకున్నారు. ఆ సమయంలో నేను ఏం చేస్తున్నానో నాకు అర్థమైంది. నా పిల్లల కోసం బతకాలని నిర్ణయించుకున్నాను. మా తల్లి మరణించిన 10-15 రోజులకు ఆ ఆలోచన నుంచి పూర్తిగా బయటపడ్డానని గోవిందా తెలిపారు. ప్రస్తుతం గోవిందా చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

మాలో ఛాన్స్ కొట్టేసిన మీనాక్షి చౌదరి?



మెగాస్టార్ చిరంజీవి హీరోగా బాబీ కొల్లి దర్శకత్వంలో ప్రస్తుతం 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో మోస్ట్ బ్యూటిఫుల్ నటి మీనాక్షి చౌదరి భాగం కాబోతున్నట్లు, ప్రస్తుతం ఆమెతో మేకర్స్ మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మీనాక్షి ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రలో కాకుండా ఓ గెస్ట్ పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం.

ఆమెకు సంబంధించిన సన్నివేశాలు సెకండాఫ్‌లో వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ చిత్రంలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఈ సినిమాలో అసలు హీరోయిన్ పాత్ర ఉంటుందా? లేదా? అనే ఆసక్తి కూడా ప్రేక్షకుల్లో నెలకొంది. ఎస్ఎస్ తమన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు సమాచారం.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com